PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 144 | విజయవాడ, ఆదివారం 25 డిసెంబర్ 2022 | 8 + 6 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 25 December 2022 | Rs

26న దేశవ్యాప్తంగా జిల్లాల్లో

ట్రాక్టర్ మార్చ్‌లు

- హర్యానా జింద్‌లో భారీ కిసాన్ మహాపంచాయత్
- ఎస్‌కెఎం జాతీయ సమావేశంలో నిర్ణయం
- విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్

● లోపలి పేజీలో.. ●





పులివెందుల సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

చెడిపోయిన వ్యవస్థతో

యుద్ధం చేస్తున్నాం

- త్వరలో ఆరులైన్ల బెంగళూరు-పులివెందుల-విజయవాడ రహదారి
- 175 సీట్లు గెలుపే లక్ష్యం : ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, వేంపల్లె

రాష్ట్రంలో చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కేవలం ప్రతిపక్షనేత చంద్రబాబుతోనే యుద్ధం చేయడంలేదని, చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేయాల్సి వస్తోందని తెలిపారు. కడప జిల్లా పులివెందుల పట్టణంలో మూడేళ్ల కిందట శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ పులివెందుల్లో ఆర్‌టిసి బస్టాండు నిర్మాణంపై చంద్రబాబు చేసిన విమర్శకు సమాధానంగా, దేశంలోని ఆర్‌టిసి బస్ టెర్మినల్స్ అన్నింట్లోకి అధునాతన హంగులతో రోల్‌మోడల్‌గా నిర్మించి ప్రారంభించినట్టు తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, చంద్రబాబుతో యుద్ధం చేయడం లేదని, నెగిటివ్ మీడియాతో, చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేయాల్సి వస్తోందని అన్నారు. బటన్ నొక్కడం ద్వారా మూడు లక్షల కోట్ల రూపాయల మేర లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గతంలో ఇదే బడ్జెట్, ఇదే రాష్ట్రం ఉండేదని, అప్పటి పాలకులు ఈ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

గతానికీ, నేటికీ తేడా ముఖ్యమంత్రి మారడమే కారణమని, దీన్ని గమనించాలని అన్నారు. రాష్ట్రంలో వివక్ష, లంచాలకు ఎక్కడా తావు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాల వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. రూ.13 వేల కోట్లతో బెంగళూరు - పులివెందుల - విజయవాడ ఆరు లైన్ల జాతీయ రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. 14 ప్యాకేజీలకుగానూ పది ప్యాకేజీలకు టెండర్లు పిలిచామన్నారు. రూ.1087 కోట్లతో పులివెందుల-బెంగళూరు, రూ.1041 కోట్లతో పులివెందుల-బి.కొత్తకోట నాలుగు లైన్ల రహదారి పనులు చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల గెలుపే లక్ష్యంగా ముందుకెళు తున్నామని, గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన 151 సీట్లను అధిగమించడం ఎందుకు సాధ్యం కాదని కార్యకర్తలకు దిశానిర్దేశం

మిగతా 2లో

బంగాళాఖాతంలో

అల్పపీడనం

- చలిగాలులు, వర్ష సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతీ బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు యానాంలో చలిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య, తూర్పు దిశల్లో ఈ చలిగాలులు వీస్తాయని పేర్కొంది. మరో ఒకటి, రెండు రోజులు ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల 25న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఒక మోస్తారు వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపింది. వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు శనివారం సాయంత్రానికి ట్రింకోమలీ(శ్రీలంక)కి తూర్పు ఈశాన్యంగా 400 కిలోమీటర్ల దూరంలో, నాగపట్నంకు తూర్పుగా 470 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు సమీపంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది గంటకు 13 కి.మీ వేగంతో పశ్చిమ నైరుతి దిశగా పయనించే అవకాశం ఉంది. ఆదివారం ఉదయానికి శ్రీలంక తీరానికి చేరకుని, అక్కడినుండి పశ్చిమ నైరుతీ దిశగా కదులుతూ 26 ఉదయం నాటికి కొమోరిన్ పరిసర ప్రాంతాలకు చేరుకుంటుంది.

బట్టబయలైన కాషాయ బూటకం!

- ఎల్గార్ పరిషద్‌కు, హింసకు సంబంధమే లేదు
- విచారణ కమిషన్ ముందు సాక్ష్యమిచ్చిన పోలీసు అధికారి

● లోపలి పేజీలో.. ●

రసీదుల్లేని ఇ-క్రాప్

- ఖరీఫ్‌లో నూరు శాతం నమోదులన్న సర్కారు
- పది శాతం కూడా లేని అక్నాలెడ్జ్‌మెంట్
- పారదర్శకత ప్రశ్నార్థకం
- రైతులకు నష్టం
- అక్రమార్కులకు అవకాశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంట సాగుల నమోదుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇ-క్రాప్' పారదర్శకత ప్రశ్నార్థకంగా తయారైంది. ఇ-క్రాప్ పోర్టల్‌లో పంటలు నమోదయ్యాయని తెలియజేస్తూ రైతులకు విధిగా వ్యవసాయశాఖ భౌతిక రసీదులు జారీ చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియ ఆనవాళ్లు ఎక్కడా కనిపించట్లేదు. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ సగం గడుస్తున్నా ఖరీఫ్ పంట నమోదుల భౌతిక రసీదులు పట్టుమని పది శాతం కూడా పూర్తి కాలేదని సమాచారం. ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యానవన, సెరీకల్చర్ అన్నీ కలుపుకొని కోటి పది లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని సర్కారు వెల్లడించింది. నూరు శాతం విస్తీర్ణానికి ఇ-క్రాప్ చేసేశామనీ ప్రకటించింది. రైతులకు జారీ చేసే రసీదులను మాత్రం విస్మరించింది. దాంతో తమ పేరు ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కిందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల వద్ద ఇ-క్రాప్ చేయించుకున్న ఆధారం లేక అన్ని విధాలా నష్టపోయే ప్రమాదం నెలకొంది.

జవాబుదారీ ఏదీ?

ప్రభుత్వం రైతన్నల కోసం అమలు చేసే అన్ని పథకాలకూ ఇ-క్రాప్ తప్పనిసరి చేసింది. ఇ-క్రాప్‌లో ఎక్కితేనే రైతు భరోసా, సున్నావడ్డీ, విత్తన సబ్సిడీ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాలు... చివరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటలు అమ్ముకోవాలన్నా ఇ-క్రాపే. అంత ముఖ్యమైన ఇ-క్రాప్ విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించింది. గ్రామ స్థాయిలోని రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె)లో విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (విఎఎ) రైతుల పొలాల వద్దకెళ్లి ఏ సర్వే నెంబర్‌లో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వెబ్‌ల్యాండ్‌లో ఎక్కిన సర్వే నెంబర్లలోనే సాగులు నమోదవుతాయి. కౌలు రైతులకైతే సిసిఆర్‌సి గుర్తింపు ఉంటేనే ఇ-క్రాప్‌లో ఎక్కుతాయి. ఆ జాబితాలను ఆర్‌బికెలలో ప్రదర్శించమన్నారు. సోషల్ ఆడిట్ అన్నారు. ఉన్నతాధికారుల ర్యాండమ్ తనిఖీలన్నారు. అనంతరం తుది జాబితాలను ధ్రువీకరించి రైతులకు రసీదులివ్వాలి. రసీదులు మినహా అన్ని పనులూ ఏదోఒక విధంగా అయిందనిపించింది ప్రభుత్వం, రసీదులు మాత్రం ఇవ్వట్లేదు. డిసెంబర్ 9 లోపు ఇ-క్రాప్ పూర్తి కావాలనగా రసీదుల పంపిణీ పది శాతం కూడా జరగలేదు. ఎంఎఒ నిర్ణీత ఫార్మెట్‌లో ధ్రువీకరించి ఎ.డి.కి, అక్కడి నుంచి డిఎఒకు, అక్కడి నుంచి కమిషనర్‌కు రసీదుల సమాచారం పంపాలనగా సరైన పర్యవేక్షణ లేక కార్యక్రమం అటకెక్కింది.



అవినీతికి దారులు

పలు ప్రభుత్వ పథకాలకు అర్హులైనప్పటికీ ఇ-క్రాప్ లేదనే పేర రైతులను తిరస్కరిస్తున్నారు. తాము ఇ-క్రాప్ చేయించుకున్నామని రైతులు మొత్తుకుంటున్నా వినిపించుకునే నాథుడే లేడు. సర్కారు నుంచి వచ్చే పంట నష్టపరిహారం, బీమా, సున్నా వడ్డీ, యంత్ర పరికరాలు తదితరాలను రైతులు నష్టపోతున్నారు. కనీసం పంటలు అమ్ముకునే పరిస్థితి కూడా లేదు. సిబ్బంది చాలా ప్రాంతాల్లో పై నుంచి వచ్చే ఒత్తిళ్లతో రైతులను సంప్రదించకుండానే పంటలను నమోదు చేస్తున్నారు. రికార్డులో ఉన్న పంటకు, వేసిన పంటకు తేడా వచ్చినప్పుడు పరిహారాలు రావట్లేదు. అధికారులు, సిబ్బంది చేసే తప్పులకు రైతులు బలవుతున్నారు. కొన్ని చోట్ల నెట్, సర్వర్ ఇత్యాది సాంకేతిక కారణాల వలన డేటా కరప్ట్ అయి ఎగిరిపోతోంది. అటువంటి సందర్భాల్లో రైతులు ఇ-క్రాప్‌లో ఎక్కినట్లు ఆధారం ఉండట్లేదు. ఒక్కొక్క ఆర్‌బికెలో 600 వరకు రైతులుంటారు. వారికి రసీదులివ్వడం పెద్దగా ఇబ్బంది ఉండదు. రసీదులివ్వకపోవడం వలన సాగుదారులు కాని వారు, తప్పుడు సమాచారంతో అనర్హులు, పెత్తందారులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, రసీదులివ్వకుండా ప్రభుత్వమే అక్రమాలను ప్రోత్సహిస్తోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

అమ్మభాషను పరిరక్షించుకుందాం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి
- ఘనంగా ముగిసిన తెలుగు రచయితల మహాసభలు
- ఆకట్టుకున్న జొన్నవిత్తుల తెలుగు పద్యాల ప్రసంగం



ముగింపు సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

అమ్మభాషగా ఉన్న తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇందులో కవులు, రచయితలు ముఖ్య భూమిక పోషించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు శనివారం ముగిశాయి. ప్రాభవం కోల్పోతున్న తెలుగును పరిరక్షించుకోవాలని, తెలుగు భాషను పరిరక్షించే బాధ్యత కవులపైనే ఎక్కువగా ఉందని మహాసభల్లో ప్రతి ఒక్కరి నోటా వినిపించింది. రెండో రోజు శనివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో జస్టిస్ ఎ.వి.శేషసాయి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎందరో మహనీయులు, కవులకు పుట్టినిల్లు తెలుగు రాష్ట్రమన్నారు. తెలుగు కవులు ప్రజలను ఎంతో చైతన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఉన్నంత వరకూ అమ్మభాషకు భయం లేదన్నారు. అమ్మభాషను పరిరక్షించడంలో అమ్మే ప్రధాన పాత్ర వహించాలని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి, సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు చక్కని తెలుగు పద్యాలతో సభను ఆద్యంతం రక్తి కట్టించారు. ప్రస్తుతం తెలుగు భాషా బోధించే పాఠశాలలు కనిపించడం లేదని అన్నారు. రానున్న కాలంలో తెలుగును పరిరక్షించుకునే బాధ్యత రచయితలపైనే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ సందేశం ఇచ్చారు. సభకు అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత కె.వి.వి.సత్యనారాయణ బృందం ప్రదర్శించిన ఆముక్తమాల్యద నృత్య రూపకం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 'మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రచయితల పాత్ర' అనే అంశంపై ఆదికవి నన్నయ్య వేదికపై సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ ప్రసంగించారు. అంతరించిపోతున్న

మిగతా 5లో

ఆధార్ అనుసంధానించకపోతే

ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డులు పనిచేయవు

న్యూఢిల్లీ : పాన్ కార్డులకు ఆధార్ అనుసంధానించకపోతే 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లవని కేంద్ర ఆదాయ పన్నుల శాఖ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఆదాయ పన్ను చట్టం 1961 ప్రకారం, మినహాయింపు వర్గం పరిధిలోకి రాని పాన్ హోల్డర్లందరూ మార్చి 31లోపు పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయడం తప్పనిసరని, లింక్ చేయని పాన్‌కార్డులు ఏప్రిల్ 1 నుంచి పని చేయవని పేర్కొంది. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) మార్చి 30న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఒకసారి పాన్ పనిచేయకపోతే ఐటి చట్టం ప్రకారం అన్ని పరిణామాలకు ఆ వ్యక్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, పలు ఇబ్బందులను ఎదుర్కోనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పని చేయని పాన్ కార్డును ఉపయోగించి ఐటి రిటర్నులను ఫైల్ చేయలేరని, పెండింగ్‌లో ఉన్న రిటర్న్‌లు ప్రాసెస్ చేయబడవని గుర్తు చేసింది. ఆ తరువాత పాన్ కార్డులను అనుసంధానించడం కూడా సాధ్యం కాదని తెలిపింది. అందువల్ల వెంటనే పాన్ కార్డులను, ఆధార్‌కు అనుసంధానించాలని కేంద్ర ఆదాయ పన్నుల శాఖ సూచించింది.

విద్యుత్తు చట్ట సవరణలతో

తీవ్ర నష్టం

విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్టిన విద్యుత్తు చట్టసవరణల బిల్లుతో ప్రజలకు తీవ్ర నష్టం కలగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు చట్టసవరణలను అనేక మంది ఎంపిలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి దీనిపై నోరెత్తడం లేదని విమర్శించారు. విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానిందని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం కూడా విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తీర్మానించాలని డిమాండ్ చేశారు. ఏ వినాశకర విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా కీర్తిశేషులు వైఎస్‌ఆర్ నాడు వామపక్షాలతో కలిసి ఆందోళన చేశారో ఆయన పేరు చెప్పుకుని ప్రభుత్వంలో ఉన్నవారు అవే సంస్కరణలను అమలు చేయాలనుకోవడం శోచనీయమన్నారు.



సత్ఫలితాలివ్వని వ్యవసాయ పంపు మోటర్లకు మీటర్ల ఏర్పాటు

వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్తు పథకానికి వైఎస్ఆర్ మొదటి సంతకం చేశారని, దానికి తూట్లు పొడుస్తూ మోడీ ఆదేశాలతో జగన్మోహన్‌రెడ్డి ఉరుకులు పరుగుల మీద వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేశారని శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మీటర్లు ఏర్పాటు వల్ల 30 శాతం విద్యుత్తు ఆదాతోపాటు నాణ్యత పెరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గుల వల్ల మోటర్లు కాలిపోతాయని తెలిపారు. మీటర్లు ఏర్పాటు చేసినంత మాత్రాన మోటార్లు కాలకుండా ఉంటాయా? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో ఎక్కడా పారదర్శకత లేదన్నారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో పెట్టిన మీటర్లతో పోలిస్తే రెట్టింపు రేట్లకు కొని రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం వృథా చేసిందని విమర్శించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మీటర్లలో 20 శాతం మీటర్లు కాలిపోయాయని, అటువంటప్పుడు 30 శాతం విద్యుత్తు ఆదా అయిందని

మిగతా 2లో



2.3 లక్షల కేజీల గంజాయి దహనం

- గుంటూరు, విశాఖ రేంజ్ పరిధిలో కాల్చివేత

ప్రజాశక్తి - యంత్రాంగం

గుంటూరు, విశాఖ రేంజ్ పరిధిలో నమోదైన 1074 కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 2,03,808 కేజీల గంజాయిని దహనం చేశారు. గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమ్ వర్మ, విశాఖ రేంజ్ డిఐజి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. బహిరంగ మార్కెటులో వీటి విలువ రూ.244 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం మరియు నెల్లూరు జిల్లాల్లోని ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన 146 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 10,424.306 కేజీల గంజాయిని గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీసు స్టేషన్ పరిధి పేరేచర్ల దగ్గర గల కైలాసగిరి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద దహనం చేశారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు, విశాఖ రేంజ్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నమోదైన 929 కేసుల్లో పట్టుబడ్డ 1,93,384 కేజీల గంజాయిని, 133 కిలోల హాశిష్ ఆయిల్‌ను అనకాపల్లి జిల్లా కేంద్రానికి సమీపంలోని కోడూరు గ్రామంలో దహనం చేశారు.

విద్వేషాల వ్యాప్తే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నైజం

- ప్రేమతో తిప్పికొడుతున్నామన్న రాహుల్‌గాంధీ
- ఢిల్లీకి చేరిన భారత్ జోడో యాత్ర
- సోనియా, ప్రియాంక, కమల్ హాసన్ హాజరు



జోడో యాత్రలో కుమారుడు రాహుల్‌తో కలిసి నడుస్తున్న సోనియాగాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల దృష్టిని వాస్తవ సమస్యల నుంచి మళ్లించేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మత విద్వేషాలను ఒక ఆయుధంగా వినియోగిస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆయన నేతృత్వంలోని భారత్ జోడో యాత్ర హర్యానా నుంచి శనివారం ఉదయం దేశ రాజధాని ఢిల్లీలో ప్రవేశించింది. 23 కిలోమీటర్ల యాత్ర అనంతరం ఎర్రకోట వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బిజెపి ప్రభుత్వం హిందువులు, ముస్లిముల మధ్య విద్వేషాలను, భయాన్ని వ్యాప్తి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిలో భయం ఉండాలని వారు కోరుకుంటారని, ఆ భయాన్ని ద్వేషంగా మారుస్తున్నారని, కాంగ్రెస్ మాత్రం అలా జరగనివ్వదని చెప్పారు. "కొందరు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారు. మేము ప్రేమను వ్యాప్తి చేస్తున్నాం. దేశంలోని సామాన్యులు ఇప్పుడు ప్రేమ గురించి మాట్లాడుతున్నారు. భారతీయులందరినీ ఆలింగనం చేసుకుంటాం. ప్రతి రాష్ట్రంలో లక్షల మంది యాత్రలో చేరారు. యాత్రలో హిందుస్థాన్, 'మొహబ్బత్' (ప్రేమ) ఉంది. ఇది ఏ కులం, మతం, ధనిక, పేద అని చూడదు. అందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటారు" అని రాహుల్ గాంధీ అన్నారు. "భారత్ జోడో యాత్రలో ప్రేమ, అహింస మాత్రమే ఉన్నాయి. ఈ యాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సాగి అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తాం" అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ప్రధాని మోడీది కాదని, అంబానీ, అదానీల ప్రభుత్వమని విమర్శించారు. 'ప్రధాని, బిజెపి తన ప్రతిష్టను నాశనం చేయడానికి వేల కోట్లు ఖర్చు చేశారని, ఒక నెలలోనే దేశానికి నిజం చూపించానని రాహుల్ అన్నారు. జోడో యాత్రలో ఐటిఒ వద్ద యాత్రలో ప్రముఖ నటుడు కమల్ హాసన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాంగ్రెస్‌వాది అని, తనకు రకరకాల భావజాలాలు ఉన్నాయని చెప్పారు. దేశం విషయానికి వచ్చేసరికి అన్ని రాజకీయ పార్టీల రేఖలు మసకబారిపోవాలని, ఆ రేఖను మసకబార్చి, ఇక్కడికి వచ్చానని చెప్పారు. భారత్ జోడో యాత్రను చూసి బిజెపి ప్రభుత్వం భయపడిపోయిందని, దానిని ఆపేందుకు కోవిడ్-19ని

మిగతా 5లో

ఇటుక బట్టీలో పేలుడు..

తొమ్మిది మంది మృతి

- మరో ఎనిమిదిమందికి తీవ్ర గాయాలు

● లోపలి పేజీలో.. ●

సామాజిక పురోగతిలో

తమిళనాడు, కేరళ టాప్

- అట్టడుగున అస్సాం, బీహార్, జార్ఖండ్
- ఆంధ్రాకు 23, తెలంగాణకు 26 ర్యాంకులు
- ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక



కైకాలకు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభిమానులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాలతో ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణకు తుది వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కుటుంబ సభ్యులు శనివారం అంతిమసంస్కారాలు నిర్వహించారు. నవరస నటసార్వభౌముడిని చివరిసారిగా చూసేందుకు అభిమానులు, సినీ రాజకీయ ప్రముఖులు ఫిల్మ్ నగర్‌లోని నివాసానికి తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కైకాల సత్యనారాయణ అంతిమయాత్ర ప్రారంభమైంది. కైకాల అమర్ రహే.. నవరస నటసార్వభౌమా.. జోహార్లు నినాదాలతో అంతిమయాత్ర జూబ్లిహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు సాగింది. కైకాల భౌతికకాయాన్ని చితిపై ఉంచిన తర్వాత పోలీసుల గౌరవవందనం చేశారు. మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి సంతాపం వ్యక్తం చేశారు. అధికారలాంఛనాల అనంతరం సంప్రదాయ పద్ధతిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కైకాల సత్యనారాయణ పెద్ద కుమారుడు కెవిఎస్ రామారావు చితికి నిప్పంటించారు. అంతకుముందు ఇంటి వద్ద సినీ ప్రముఖులు నాగబాబు, రాజేంద్ర ప్రసాద్, తనికెళ్లభరణి, పరచూరి బ్రదర్స్, జీవిత రాజశేఖర్, గద్దర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,తదితరులు కైకాలకు నివాళులర్పించారు.

క్రీస్తు జీవితం స్ఫూర్తి దాయకం

- గవర్నర్, సిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్రిస్మస్ సందర్భంగా ప్రజలకు రాష్ట్ర గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు ప్రభృతులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలియజేశారు. సద్గుణం, విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపడానికి ఏసుక్రీస్తు జీవితం స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రజలందరి మధ్య ప్రేమ, సహనం , కరుణ పాదుకొల్పే ఏసు బోధనలను గౌరవించడానికి క్రిస్మస్ మంచి సందర్భమన్నారు. దుర్మార్గం నుంచి సన్మార్గానికి, అమానుషత్వం నుంచి మానవత్వానికి చెడునుంచి మంచికి, దురాశ నుంచి దాతృత్వం , త్యాగాలకు జీసస్ బాటలు వేశారని పేర్కొన్నారు. కరుణ, ప్రేమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రేపటి నుంచి ఇఎపిసెట్ బైపిసికి 'తుది' కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇఎపిసెట్ బైపిసి స్ట్రీమ్ విద్యార్థులకు తుది దశ కౌన్సిలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇఎపిసెట్ అడ్మిషన్ల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి నాగరాణి శనివారం విడుదల చేశారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యేందుకు ఈ నెల 26, 27 తేదీల్లో నగదు చెల్లించాలని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 26 నుంచి 28 వరకు జరుగుతుందన్నారు. 26 నుంచి 29వ తేది వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చునని వెల్లడించారు. 29న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. 31న సీట్ల కేటాయింపు ఉత్తర్వులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు జనవరి 2 లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. మొదటి దశ కౌన్సిలింగ్‌కు హాజరు కానీ అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు పరిశీలన చేసుకోవచ్చునని తెలిపారు.

మైనార్టీల పోరాటానికి సంపూర్ణ మద్దతు : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీల పోరాటానికి టిడిపి నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. మైనార్టీల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ముస్లిం మైనార్టీ ప్రముఖులు టిడిపి నేతలతో కలిసి లోకేష్‌ను తన నివాసంలో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, సంక్షేమ పథకాలు నిలిపివేశారని లోకేష్‌కు వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక..మైనార్టీలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మరో రివర్స్ రికార్డు : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఖాతాలో మరో కొత్త రివర్స్ రికార్డు చేరిందని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. రైతుల తలసరి అప్పులో జాతీయ స్థాయిలో రాష్ట్రమే ప్రథమ స్థానమని రాజ్యసభలో కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి ప్రకటించారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తలసరి రైతు కుటుంబం అప్పు రూ.2,45,554గా ఉందన్నారు. కనీస మద్దతు ధర కల్పించకపోవడంతో రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుందని విమర్శించారు.

- ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్ హత్యా రాజకీయాలతో నెగ్గుకు రావాలను కుంటున్నారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. పెత్తందారీ ఆలోచనలకు ప్రతిరూపమే మాచర్ల దాడి అని పేర్కొన్నారు.

ధర్మాన నేతృత్వంలోని అసైన్డ్‌కమిటీని రద్దు చేయండి

- వ్యవసాయ కార్మికసంఘం రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసైన్డ్‌భూములను రెగ్యులర్ చేసేందుకని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీని తక్షణమే రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేఇసంది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం ఆ సంఘ రాష్ట్ర నాయకులు వి. శివనాగరాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పేదల చేతుల్లో ఉన్న ఈ భూములను లాక్కోవడానికే కమిటీని వేశారని పేర్కొంది. అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1954 నుండి 2009దాకా వామపక్షాలు, వ్యవసాయకార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా దాదాపు 30 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా కేంద్రం 9/77 చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం పేదల చేతుల్లో వున్న అసైన్డ్‌భూములను లాక్కుని కార్పోరేట్‌లకు కట్టబెట్టేందుకు ఈ కమిటీను వేఇసందని అన్నారు. పేదలకు హక్కులు కల్పిస్తామని చెబుతూ ఆచరణలో ఆ భూములను వారు కోల్పోయేలా కుట్రలు చేస్తోందన్నారు. తమ కోసమే చేస్తున్నారని భ్రమలు కల్పించేందుకు కమిటీలో దళిత ఎమ్మెల్యలను వేశారని పేర్కొన్నారు వ్యవసాయకార్మిక సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జల్లీవిల్సన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల చేతుల్లో భూములు వుండరాదని భావిస్తోందని విమర్శించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు భూమి అనేది తల్లిలాంటిదని అన్నారు. అలాంటి భూమిని రైతుల వద్దనుండి కాజేసేందుకు ప్రభుత్వాలే కుట్ర పూరితంగా వ్యవహరించడం తగదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూత్రధారి అయితే రాష్ట్ర ప్రభుత్వం పాత్రధారిగా వుందని అన్నారు. అసైన్డ్‌భూములతోపాటు 35లక్షల ఎకరాల చుక్కల భూములను లాక్కునేందుకే ఈ కమిటీలను వేస్తున్నారని విమర్శించారు. అధికారులు రికార్డులను తెమ్మంటే వారసత్వంగా వున్న ఆభూములకు రికార్డులు ఎక్కడనుండి వస్తాయని ప్రశ్నించారు. అసైన్డ్, చుక్క భూములను తీసుకొని భూబ్యాంక్ పెట్టి వారికి కావాల్సినవారికి, కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టేలా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను సంఘటితంగా తిప్పి కొట్టాలని అన్నారు. సామాజిక ఉద్యమనాయకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అసైన్డ్‌భూములు కలిగివున్న రైతులందరినీ సమీకరించి బలమైన ఉద్యమాలను నిర్మించాలని అన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత కిసాన్‌మహాసభ కార్యదర్శి హరనాథ్, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు నటరాజ్, క్రాంతి, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు బి కోటేశ్వరి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, వేదికపై జల్లి విల్సన్, కృష్ణయ్య తదితరులు

26న ఎంబి స్మారకోపన్యాసం

- 'రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి' అంశంపై సదస్సు
- హాజరుకానున్న కేరళ మంత్రి ఎంబి రాజేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రముఖ స్వాతంత్ర్యసమర యోధులు, మార్క్సిస్టు సిద్ధాంతకర్త మాకినేని బసవపున్నయ్య 108వ జయంతి నేపథ్యంలో విజయవాడలోని ఎంబివికెలో 'రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి' అన్న అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు విజ్ఞానకేంద్రం కార్యదర్శి పి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన విజ్ఞాన కేంద్రం కమిటి సభ్యులు టి క్రాంతికుమార్, గుండు నారాయణ, డివి రాజులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సుకు కేరళ స్థానికస్వపరిపాలన, ఎక్సైజ్ శాఖా మంత్రి ఎంబి రాజేష్ హాజరై స్మారకోపన్యాసం చేస్తారని, ఎంబివికె మేనేజింగ్ ట్రస్టీ పి మధు పాల్గొంటారని తెలిపారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి చేస్తోందని పి. మురళీకృష్ణ అన్నారు. రాష్ట్రాలకు వున్న హక్కులను పూర్తిగా విస్మరిస్తూ ఏ మాత్రం సంప్రందించకుండానే కేంద్రం చట్టాలను చేస్తోందని విమర్శించారు. రాష్ట్రాలకు జిఎస్‌టిలో వాటాను సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. కేంద్రప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్రాల హక్కులపై చేస్తున్న దాడులను ఖండించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రజాతంత్రవాదులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్దసంఖ్యలో హజరై ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్ సింటర్ ప్లాంట్ కార్మికులు

బదిలీలపై ఉపాధ్యాయుల్లో గందరగోళం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధాల కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. బదిలీల నిమిత్తం విడుదల చేసిన 187,190 జివోలలో ఇచ్చిన మార్గదర్శకాలు అర్హులైన సీనియర్లకు నష్టం చేకూర్చేలా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు 117 జివో ప్రకారం రేషనలైజేషన్ చేయడంతో అనేక ప్రైమరీ, యుపి స్కూల్స్ సిబ్బంది కూడా నష్టపోయేవీలుంది. ఉపాధ్యాయులు కష్టపడి విద్యార్థుల సంఖ్య పెంచినా.. రేషనలైజేషన్ వల్ల వారు కూడా నష్టపోవాల్సివస్తోంది. 2021 బదిలీల్లో వచ్చి రేషనలైజేషన్‌కు గురైనవారికి మాత్రమే రేషనలైజేషన్ పాయింట్లతో పాటు పాత స్టేషన్ పాయింట్లు కూడా వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల 2015, 2017 బదిలీల్లో వచ్చి పూర్తికాలం పనిచేయకుండానే రేషనలైజేషన్‌కు గురై నష్టపోవాల్సివస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గత బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురైన వారికి పాత స్టేషన్ పాయింట్లతో పాటు ప్రిఫరెన్షియల్, స్పౌజ్ కేటగిరీలు వర్తింపచేయగా ఈ బదిలీల్లో వాటిని నిరాకరించడంతో సీనియర్లు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. రోజువారీ తీసుకునే నిర్ణయాలను ఉత్తర్వులు రూపంలో కాకుండా వెబెక్స్ ద్వారా అధికారులకు తెలియజేస్తుండటం ఉపాధ్యాయులను సమస్యల్లోకి నెడుతోంది. దీనివల్ల మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటూ అమల్జేస్తుండటంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురౌతున్నారు. వీటి కారణంగా ఇప్పటికే కొందరు ఉపాధ్యాయులు బదిలీ కోసం దరఖాస్తు కూడా చేసుకోలేకపోయారు.

జివో 117పేరుతో రేషనలైజేషన్ చేయడం, జివో 128ను పరిగణనలోకి తీసుకోకపోవడం, మ్యాపింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణంగా అవసరం లేకపోయినా ఉపాధ్యాయులు రేషనలైజేషన్‌కు గురవుతున్నారు. బదిలీలకు చూపించే వేకెన్సీల విషయంలో అధికారుల వ్యవహారశైలి కూడా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తోంది. బదిలీల షెడ్యూల్ తక్కువ వ్యవధితో హడావుడిగా రూపొందించడం, తగినంత సమయం ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు షెడ్యూల్‌ను ముగించడం వల్లే సమస్యలకు కారణమని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

కౌన్సిలింగ్ రీషెడ్యూల్ చేయాలి : యుటిఎఫ్ డిమాండ్

ఈ నేపథ్యంలో బదిలీ కౌన్సిలింగ్ రీషెడ్యూల్ చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బదిలీకి దరఖాస్తు చేసుకోనివారికి కూడా అవకాశం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఒక్కో జిల్లాల్లో ఒక్కో విధంగా నిబంధనలు పాటించడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, అస్సలు ఇన్ని సమస్యలతో బదిలీలు అవసరమా? అనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తే ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. తగినంత సమయం ఇచ్చేలా బదిలీల షెడ్యూల్‌లో మార్పు చేయాలని కోరారు. 2020 బదిలీలకు ఇచ్చిన జివో 54లోని అంశాలను అమల్జేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే బదిలీలను కొంతకాలం వాయిదా వేసి సమస్యల పరిష్కరించిన తర్వాతే కౌన్సిలింగ్ చేపట్టాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనకు చేపడుతామని హెచ్చరించారు.

'ఉక్కు' పోరాటంపై కేంద్రం స్పందించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం సుదీర్ఘకాలంగా జరుగుతున్న పోరాటంపై కేంద్రం స్పందించి, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 681వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సింటర్ ప్లాంట్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మొండిగా ముందుకెళ్తే రానున్న కాలంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోన్న ప్రభుత్వ రంగ సంస్థలను అందరూ కలిసి కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యం మేరకు నడిచేలా స్టీల్ యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు. దీక్షల్లో కార్మిక నేతలు, ఉద్యోగులు ఎన్.నారాయణరావు, డివికె.రాజు, కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

- మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం విజయవాడ తుమ్మళపల్లి కళాక్షేత్రంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మోసానికి గురైతే ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడా ఇంటి నుంచే ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. పెట్రోల్ , డీజిల్ కొలతల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, ప్రభుత్వ చీఫ్ విప్ సామినేని ఉదయభాను, పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్, డైరెక్టర్ సృజన, తూనికలు, కొలతల శాఖ డైరెక్టర్ జనరల్ కెఆర్ఎం కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రాజధాని పేరిట ప్రాంతాల మధ్య చిచ్చు : చంద్రబాబు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి



ప్రసంగిస్తున్న చంద్రబాబు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నమ్మక ద్రోహి అని, నవరత్నాల పేరిట నవమోసాలకు పాల్పడుతున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రాంతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని దుయ్యబట్టారు. విజయనగరం జిల్లా పర్యటనలో మూడో రోజు శనివారం ఆయన విజయనగరంలోని కోట జంక్షన్లో బహిరంగ సభలో ప్రసంగించారు. ఉత్తరాంధ్రలో ఎ-2 (విజయసాయిరెడ్డి), జగన్ బాబాయ్ సుబ్బారెడ్డి పెత్తనం ఎందుకని ప్రశ్నించారు. సిఎం జగన్ ఉత్తరాంధ్ర ఆత్మగౌరవాన్ని ఒక సామాజిక తరగతికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ఒకే సామాజిక తరగతిని పెట్టి రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 60 మంది సలహాదారులు ఉంటే, అందులో ఉత్తరాంధ్రకు చెందిన వారు ఒక్కరూ లేరన్నారు. వీటన్నింటిపైనా ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు బొత్స, ధర్మాన ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారో చెప్పాలని నిలదీశారు. ఉత్తరాంధ్ర టిడిపికి కంచుకోట, గుండెకాయ వంటిదన్నారు. అధికారంలోకి రాగానే ప్రతి మండలంలోనూ అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న పథకాలను కొనసాగిస్తూనే విదేశీ విద్య వంటి మరిన్ని పథకాలను పునరుద్ధరిస్తానని పేర్కొన్నారు. ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డు ఉద్యోగులకు పింఛన్లు సకాలంలో ఇవ్వలేదని దుస్థితిలో రాష్ట్రం ఉందన్నారు. పైగా, ఉద్యోగులపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతీయువకులే తమ పార్టీకి ఆలిండియా రేడియోలని, వారి ఫోన్లే తనకు ప్రచార సాధనాలని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా ఉత్తరాంధ్రలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా ఈ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. వంశధార, నాగావళి అనుసంధాన ప్రణాళిక కూడా ముందుకు సాగలేదన్నారు. రైతుల ఆత్మహత్యల్లోనూ, తలసరి అప్పుల్లోనూ, అత్యాచారాల్లోనూ రాష్ట్రం నంబర్ వన్‌లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. విశాఖపట్నం ఆర్థిక, టెక్నాలజీ రాజధాని కావాలని, టూరిజం హబ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. నిప్పులాంటి అశోక్‌పై తప్పుడు కేసులు పెట్టి ఏం పీకారని ప్రశ్నించారు.

వ్యవసాయాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

టిడిపి అధికారంలోకి వస్తే వ్యవసాయాభివృద్ధికి సమగ్ర విధానాన్ని రూపొందిస్తామని చంద్రబాబు వెల్లడించారు. శనివారం ఉదయం బొబ్బిలి కోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అధ్యక్షతన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం, చెరుకు సాగు, కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ మూతపడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాడంగి మాజీ ఎంపిపి త్రినాథ విన్నవించారు. విద్యుత్తు బిల్లులు పెరిగాయని, పామాయిల్ రైతులకు నష్టం వాటిల్లుతోందని పలువురు రైతులు ఏకరువు పెట్టారు. చంద్రబాబు స్పందిస్తూ ధాన్యం రైతులను దోపిడీ చేయడం అన్యాయమన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు పాల్గొన్నారు.

చెడిపోయిన వ్యవస్థతో యుద్ధం చేస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

చేశానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలం సురేష్, ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆర్‌టిసి కార్పొరేషన్ చైర్మన్ డి.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌లో తన తండ్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి జగన్ ఘనంగా నివాళులర్పించారు. ఇడుపులపాయి వ్యవసాయ క్షేత్రంలోని గెస్ట్‌హౌస్‌లో బస చేసిన ఆయన ఉదయం 9.30 గంటలకు వైఎస్ఆర్ ఘాట్ వద్దకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి చేరుకున్నారు. అక్కడ వైఎస్ఆర్ ఘాట్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. చర్చికి వెళ్లి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. జగన్ తల్లి విజయమ్మ, సతీమణి భారతిరెడ్డి, బంధువులతో కలిసి రెండు గంటల పాటు కిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకలకు వచ్చిన బంధువులను, స్నేహితులను పేరుపేరునా పలకరించి ఆత్మీయ అలింగనం చేసుకున్నారు.

బాపట్ల డిఎం బదిలీని రద్దుచేయాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాపట్లలో ఆర్‌టిసి స్థలంలో రాజకీయపార్టీ కార్యాలయం ఏర్పాటు అంశంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్న డిపోమేనేజర్ శ్రీనివాసరెడ్డిని బదిలీ చేయడం అక్రమమని, తక్షణం ఈ అక్రమ బదిలీని ఆపాలని ఎపిపిటిడి(ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని భాష, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధానకార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి, ప్రచారకార్యదర్శి టిపిఆర్ దొరలు ఒక ప్రకటన విడుదల చేశారు. డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి ఆర్‌టిసి స్థలం అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని బాధ్యతాయుతంగా వ్యవహరించారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి అక్రమ బదిలీని తక్షణం రద్దుచేసి బాపట్లలోనే విధులను నిర్వర్తించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఆర్‌టిసి స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

27న 'ప్రజాస్వామ్య పరిరక్షణ'పై సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'స్టేట్ టెర్రరిజం.. ప్రజాస్వామ్య పరిరక్షణ'పై అనే అంశంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వార్యాన సదస్సు నిర్వహించనున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ నెల 27న విజయవాడలోని ఇన్నోటెల్ హోటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలపై దాడుల కేసుల్లో ఈ ఏడాది 90 మందికి శిక్ష

- కోర్టు మానిటర్‌సెల్‌తో విచారణ వేగవంతం
- పోలీసు శాఖ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు సంబంధించిన కేసుల్లో గతంతో పోలిస్తే ఈ ఏడాది విచారణ వేగంగా జరుగుతోందని రాష్ట్ర పోలీసు శాఖ తెలిపింది. కోర్టు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశాక రికార్డు స్థాయిలో ఈ ఏడాది 90 మందికి శిక్షపడింది. రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ వల్లే ఇది సాధ్యపడిందని పేర్కొంది. కోర్టు మానిటరింగ్ కోసం ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడంతో విచారణ వేగవంతమైనట్లు తెలిపింది. పోలీసు శాఖ ప్రకటన ప్రకారం..2014లో కేవలం ఏడుగురికి మాత్రమే ఈ కేసుల్లో శిక్ష పడింది. అలాగే 2015లో 20 మందికి, 2016లో 38 మందికి, 2017లో 34 మందికి, 2018లో 53 మందికి, 3019లో 61 మందికి, 2020లో 30 మందికి, 2021లో 21 మందికి, 2022లో 90 మందికి శిక్షలు పడ్డాయి. అలాగే అత్యాచారం, హత్య ఘటనలకు సంబంధించిన కేసుల్లో 44 మందికి శిక్షలు పడ్డాయి. ఈ కేసుల్లో 2017లో కేవలం ఇద్దరికి మాత్రమే శిక్ష పడగా 2018లో 8 మందికి, 2019లో 20 మందికి, 2020లో 11 మందికి, 2021లో ఐదు మందికి, 2022లో 44 మందికి శిక్ష పడింది. రాష్ట్ర డిజిపి ఎప్పటికప్పుడు ఎస్‌పిలతో ఈ కేసులపై సమీక్ష చేయడంతో రికార్డుస్థాయిలో మహిళా కేసులకు పరిష్కారం దొరికిందని పోలీసుశాఖ పేర్కొంది.

విద్యుత్తు చట్టసవరణలతో తీవ్ర నష్టం

మొదటి పేజీ తరువాయి

ఎలా చెప్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్తు మీటర్ల ఏర్పాటు సత్ఫలితాలు ఇవ్వలేదని చెప్పడానికి ఈ జిల్లాయే ఉదాహరణనని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని రుద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మీటర్ల ఏర్పాటుకు వేల కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టడం ద్వారా ప్రయివేట్ కంపెనీలకు ప్రభుత్వమే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యం కల్పిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, మీటర్ల కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై పారదర్శకంగా విచారణ చేట్టాలని డిమాండ్ చేశారు. తాము నష్టాల్లో ఉన్నామంటూ కొన్ని విద్యుత్తు సంస్థలు ట్రూ అప్ ఛార్జీల పేరుతో వచ్చే సంవత్సరం రూ.6,000 కోట్లు పెంచాలని ఇఆర్‌సికి నివేదికలు సమర్పించాయని చెప్పారు. విద్యుత్తు సంస్థల అసమర్థత, లాభాపేక్షకు రాష్ట్రాన్ని బలిచేస్తోన్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో బలవంతంగా రైతుల నుంచి అదానీకి 75 వేల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. అదానీకి భూములిస్తే ఎకరాకు రూ.30 వేలు చొప్పున లీజు చెల్లిస్తుందని ప్రభుత్వం ఆయన తరుపున హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఇది అదానీ ప్రభుత్వమా? లేక జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో రైతుల భూములను అడ్డగోలుగా అదానీ పరం చేస్తామంటే రైతులు చూస్తూ ఊరుకోరని, పోరాడుతారని, జరగబోయే పరిమాణాలను జగన్ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విశాఖ రాజధాని ఖాయం

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విశాఖపట్నం రాజధాని కావడం ఖాయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరంలోని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రాజధాని ఎవరు కోరారు? అంటూ చంద్రబాబు చేసిన విమర్శలపై బొత్స స్పందించారు. విశాఖ రాజధాని కావాలని, ఒక ప్రజాప్రతినిధిగా, మంత్రిగా తాను కోరుతున్నానని, ఉత్తరాంధ్ర వాసులు కూడా రాజధానిని కోరుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు జీతాల చెల్లింపులో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని అంగీకరించారు. విద్యుత్తు వినియోగం తెలుసుకోవడానికే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నామన్నారు. చంద్రబాబు ఉత్తరాంధ్రలోని బిసి ఎంపిలను విస్మరించి, రాజుకు కేంద్రమంత్రి పదవి కట్టబెట్టలేదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్‌బికెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, వీటిని కూడా విమర్శించడం చంద్రబాబు అబద్ధాలకు నిదర్శమని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారు కాబట్టే ధర్నాలు చేయడం లేదన్నారు.

బైజూస్ విద్యా వివక్ష

- పేద కుటుంబాలకు ట్యూషన్ల నిలిపివేత
- రూ.25వేల ఆదాయం వారిపై ఆంక్షలు
- గుర్తించిన బాలల హక్కుల కమిషన్



న్యూఢిల్లీ : దేశంలో ఆన్‌లైన్ విద్యా వ్యవస్థ మరింత అసమానతలు పెంచుతుందడానికి బైజూస్ విధానాలే నిదర్శనం. పేద వారికి ట్యూషన్లు చెప్పబోమని స్పష్టం చేసింది. నెలకు రూ.25వేల లోపు ఆదాయం కలిగిన వారికి చదువులు నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆ ఎడ్‌టెక్ సంస్థ వెల్లడించింది. ఈ విషయమై విచారణ చేపడుతున్నామని.. బైజూస్ సిఇఒకు నోటీసులు జారీ చేయనున్నట్లు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) తెలిపింది. రూ.25,000 దిగువన ఆదాయాలు కలిగిన కుటుంబాలకు ట్యూషన్లను లేదా రుణ ఆఫర్లను నిలిపి వేసే ప్రక్రియను ప్రారంభించామని బైజూస్ వ్యవస్థాపకుల్లో ఒక్కరైన ప్రవీణ్ ప్రకాష్ సందర్భోచితంగా తనతో చెప్పారని ఎన్‌సిపిసిఆర్ చైర్‌పర్సన్ ప్రయాంక్ కానూంగో తెలిపారు.

పిల్లలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను బైజూస్ కొంటుందని.. వీటితో వారికి ఫోన్లు చేసి తమ కోర్సులను కొనాలని తీవ్ర ఒత్తిడి చేస్తుందని ఎన్‌సిపిసిఆర్ ఇటీవల వెల్లడించింది. తమ కోర్సులను కొనకపోతే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని తల్లిదండ్రులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. బైజూస్ పని సంస్కృతి, ఖాతాదారుల పట్ల తన విధానాన్ని బహిర్గతం చేసిన రెండు అంశాలపై సమన్లు జారీ చేయగా.. ఈ విషయమై శుక్రవారం ఆ కంపెనీ ప్రతినిధులను విచారణకు హాజరయ్యారు. ఆ సంస్థ సిఇఒకు బదులుగా ప్రవీణ్ ప్రకాశ్ హాజరయ్యారు. ఈ విచారణలో పేద వర్గాలకు చదువును నిరాకరిస్తున్నట్లు వెల్లడయ్యిందని కానూంగో తెలిపారు.

"బైజూస్ రీఫండ్ పాలసీని విచారించాం. ఇదే సమయంలో అనేక మంది ఖాతాదారులను ఇంటర్వ్యూ చేశాం. వారు కోర్సులను కొనుగోలు చేయడంలో దోపిడికి, మోసానికి గురైయ్యామని తెలిపారు. చివరికి వారి ఫీజును వాపసు పొందలేకపోయారు. మేము టెక్ కంపెనీ పనితీరును నియంత్రించలేము. కానీ వారి దోపిడి వ్యూహాల ప్రభావం ఖచ్చితంగా మా పరిధిలో ఉంటుంది" అని కానూంగో రాయిటర్స్‌తో తెలిపారు."బైజూస్ నమోదు చేసుకున్న విద్యార్థులతో పరిచయం ఉన్న ఉపాధ్యాయులు, మెంటర్‌లతో సహా తన సిబ్బంది అందరి జాబితాను మాకు ఇవ్వాలని విచారణలో కోరాం. తన వెబ్‌సైట్‌లో ఫిర్యాదులను ఎక్కడ ఫైల్ చేయాలనే వివరాలను ప్రముఖంగా ప్రదర్శించాలని సూచించాం. తల్లిదండ్రుల ఆందోళనలను వెంటనే పరిష్కరించేలా చూసుకోవాలని చెప్పాం. కంపెనీ యొక్క దూకుడు విధానాల వల్ల పిల్లలు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న మానసిక గాయం నుండి నేడు కొంత ఉపశమనం పొందారు" అని కానూంగో తెలిపారు.

కాగా.. ఎన్‌సిపిసిఆర్ ఛైర్మన్ విమర్శలను బైజూస్ ఖండించడం కానీ.. అంగీకరించడం కానీ చేయలేదు. తమ సంస్థ నేరుగా విద్యార్థుల కుటుంబాలకు రుణాలు అందించడం లేదని.. కానీ థర్డ్ పార్టీ విత్త సంస్థల ద్వారా ఖాతాదారులకు కనెక్ట్ చేస్తున్నట్లు తెలిపింది. ఎన్‌సిపిసిఆర్ వద్ద బలమైన విధానాలను సమర్పించామని.. ప్రతీ సమస్యను బోర్డులోకి చర్చిస్తామని ఆ సంస్థ ప్రతినిధి విచారణ అనంతరం తెలిపారు.

'గ్రంథాలయాలు, విద్య, ప్రజాసంస్కృతి'పై సదస్సు

జనవరి 8న ప్రజా వికాస వేదిక నిర్వహణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'గ్రంథాలయాలు, విద్య, ప్రజా సంస్కృతి' అంశంపై ప్రజా వికాస వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరగనుంది. ఎంబి విజ్ఞాన కేంద్రంలో జనవరి 8న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజావికాస వేదిక శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 'విద్య, గ్రంథాలయోద్యమం' అనే అంశంపై కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 'ప్రజా సంస్కృతి, పునర్వికాసం' అంశంపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, 'మూఢ విశ్వాసాలు-విజ్ఞాన శాస్త్రం'పై ప్రొఫెసర్ ఎ రామచంద్రయ్య ప్రసంగించనున్నారు. 'భారతదేశంలో బహుళత్వం-జాతీయ సమైక్యత'పై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, 'లౌకికవాదం-నేటి సవాళ్లు' అంశంపై ప్రొఫెసర్ ఎన్ అంజయ్య, 'ప్రజాస్వామ్యం, రాజకీయాలు, రాజ్యాంగం' అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తారు.

పండుగల కానుకగా సంక్షేమ పథకాల రద్దు

- రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలి
- ఎపి పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-వన్‌టౌన్ (విజయవాడ)

రాష్ట్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా పింఛన్లను తొలగించడాన్ని నిరసిస్తూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 175వ సచివాలయం వద్ద 50 డివిజన్ పెన్షన్‌దారులు శనివారం ధర్నా చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు చేపట్టిన ధర్నాకు ఎపి పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్.బాబూరావు, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. నూతన సంవత్సరం, క్రిస్మస్, సంక్రాంతి కానుకలుగా పేదలకు సంక్షేమ పథకాల రద్దు, పెన్షన్లలో భారీ కోతతో జనగన్న ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. విజయవాడ 50వ డివిజన్‌లో సుమారు పది శాతం పింఛన్లను అక్రమంగా రద్దు చేశారని, వివిధ కుంటిసాకులతో నోటీసులు జారీ చేశారని తెలిపారు. రేషన్‌కార్డుల రద్దుకు రంగం సిద్ధం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. వంద గజాలకు మించి ఇల్లు ఉందనే సాకుతో పింఛన్ రద్దు చేయడం, 20 చదరపు గజాల వారికి వంద గజాలు ఉన్నట్లు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఒక కరెంట్ కనెక్షన్ ఉంటే ఐదు కనెక్షన్లు ఉన్నట్లు నోటీసులు పంపి పింఛన్లను నిలిపివేశారని తెలిపారు. ఆదాయపు పన్ను చెల్లించకపోయినా, రిటర్న్ దాఖలు చేశారన్న వంకతో పథకాలు రద్దు చేయడం బాధాకరమన్నారు. జనవరి నుండి రూ.250లు పింఛన్ మొత్తం పెంచుతామని ప్రకటించి, ఉన్న పెన్షన్లు ఊడబీకడం సరికాదన్నారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వందల ఎకరాల భూములు ఉన్నా, పాలెస్ వంటి నివాస గృహాలున్నా వారికి లక్షల రూపాయల వేతనాలు, పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు మాత్రం ఇల్లు ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని పథకాలు, పింఛన్లు రద్దు చేయడం సమంజసమా? అని ప్రశ్నించారు. రద్దు చేసిన పెన్షన్లు, పథకాలను పునఃరుద్ధరించాలని, నిబంధనలు మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో రాజు, కరీముల్లా, సుబ్బారెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.




పెన్షన్ దారులతో సచివాలయం వద్ద నిరసనలో పాల్గొన్న బాబూరావు, బోయి సత్యబాబు తదితరులు

భావనపాడు పోర్టు నిర్వాసిత రైతులకు పరిహారం పంపిణీ

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం)

మీ త్యాగం మరువలేమని, ఇది రేపటి అభివృద్ధికి నాంది అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలో నిర్మించనున్న భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్వాసిత రైతులకు పరిహారం చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఎకరాకు రూ.25 లక్షల చొప్పున మొత్తం 454 మంది రైతులకు చెందిన 312 ఎకరాలకు రూ.78.10 కోట్లను పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి విడతగా వంద మంది రైతులకు రూ.20 కోట్ల అందించనుంది. ఈ సందర్భంగా రూ.78.10 కోట్ల నమూన చెక్కును రైతులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ..

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 23 సంస్థల్లో ఒక సంస్థను కూడా జిల్లాలో ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లా నుంచి ఎన్నికైన టిడిపి నేతలు జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. రాజాం పర్యటనకు వచ్చి ప్రతిపక్ష నేత చంద్రబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో ఏ ప్రాజెక్టుకు పరిహారం కింద ఎకరా భూమికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించలేదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, సభను అడ్డుకుంటారన్న సమాచారం మేరకు మూలపేట మాజీ సర్పంచ్, టిడిపి సంతబొమ్మాళి మండల అధ్యక్షులు జీరు భీమారావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సభా ప్రాంగణానికి రాకుండా అడ్డుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సభ పూర్తయిన మధ్యాహ్నం 2గంటల వరకు నిర్బంధంలో ఉంచారు.


మురళీమోహన్‌ను సత్కరిస్తున్న వెంకయ్యనాయుడు


పురస్కారాన్ని అందుకుంటున్న జయచిత్ర

మురళీమోహన్, జయచిత్రకు ఎన్‌టిఆర్ పురస్కారం

- ఆలోచనలకు ఆలంబన తెనాలి : మాజీ ఉపరాష్ట్రపతి

ప్రజావక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాలను జయభేరి సంస్థ అధినేత, నిర్మాత, దర్శకులు, నటులు మాగంటి మురళీమోహన్, నటి జయచిత్రకు ఎన్‌టిఆర్ కుటుంబసభ్యులు శనివారం ప్రదానం చేశారు. ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్‌టిఆర్ చలనచిత్ర పురస్కార ప్రదానోత్సవ సభను శనివారం తెనాలిలోని స్థానిక నాజరుపేట ఎన్‌విఆర్ కన్వెన్షన్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఆలోచనలకు, ఆచరణలకు ఆలంబనగా కళల కాణాచి తెనాలి నిలుస్తోందని అన్నారు. జై ఆంధ్ర ఉద్యమం నుంచి తెనాలితో తనకు అనుబంధం ఉందని చెప్పారు. ఎన్‌టిఆర్ చారిత్రక పురుషుడని, రాజకీయాల్లో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించారని తెలిపారు .ముఖ్యంగా మహిళాభ్యుదయానికి ఆయన నాంది పలికారని కొనియాడారు. ఎన్‌టిఆర్ తనయుడు రామకృష్ణ, కుమార్తె లోకేశ్వరి మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా, తెనాలి కళావైభవానికి నిదర్శనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఎన్‌టిఆర్ పేరిట ఈ పురస్కారాన్ని అందుకోవటం పట్ల పురస్కార గ్రహీతలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కామినేని శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిఎస్ రాధారాణి, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రచయితలు షాబీర్‌షా, బుర్రాసాయిమాధవ్, షేక్ జానిభాషా, టి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

26 వరకు కొచ్చర్ దంపతులకు సిబిఐ కస్టడీ

న్యూఢిల్లీ : వీడియోకాన్‌కు రుణాలు ఇవ్వడం ద్వారా క్విడ్‌ప్రోకోకు పాల్పడిన కేసులో ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ, ఎండి చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లను సిబిఐ కస్టడీకి తీసుకుంది. వారిని మూడు రోజుల పాటు అంటే డిసెంబర్ 26 వరకు సిబిఐ కస్టడీకి అవకాశం ఇస్తూ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం వీరిని సిబిఐ అధికారులు అరెస్ట్ చేసి.. ముంబయి సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరు పర్చారు. కొచ్చర్ దంపతులు తమ దర్యాప్తునకు సహకరించడం లేదని సిబిఐ ఆరోపిస్తోంది.



జనంతో కిటకిటలాడుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షో

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు జన తాకిడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో శనివారం రెండో రోజుకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చి స్థిరాస్తుల వివరాలను తెలుసుకున్నారు. జోరుగా కొనుగోళ్లు సాగాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ అధ్యక్షులు కెఎస్‌ఆర్‌కె.రాజు మాట్లాడుతూ.. గతేడాది కంటే ఈ సారి సందర్శకుల తాకిడి పెరిగిందని, స్థిరాస్తి కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని, పెరిగిన ఆన్ స్పాట్ బుకింగ్‌లే దీనికి నిదర్శనమని అన్నారు. అన్ని స్టాళ్లూ కళకళలాడుతున్నాయని ఎక్స్‌పో కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు. రెండో రోజు కార్యక్రమంలో క్రెడాయ్ ఉమెన్ వింగ్ ఆధ్వర్యాన నిర్వహించిన 'రూఫ్‌టాప్ సోలార్' సెషన్ అందరినీ ఆకర్షించింది. ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమానికి టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఎయులోని ఆర్కిటెక్ విద్యార్థులకు రాజు స్మారక అవార్డులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

40 నిమిషాల్లో రెండు లక్షల టికెట్లు విక్రయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేసిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. జనవరి రెండో తేదీ నుంచి 11వ తేదీ వరకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను శనివారం ఉదయం తొమ్మిది గంటలకు టిటిడి వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. కేవలం 40 నిమిషాల్లోనే రెండు లక్షల టికెట్లు విక్రమయ్యాయి. ఇదిలా ఉండగా జనవరి ఒకటి నుంచి ఐదురోజుల పాటు ఆఫ్‌లైన్ విధానంలో తిరుపతిలో టోకెన్లను ఇవ్వనున్నారు. తొమ్మిది కేంద్రాల ద్వారా రోజుకు 50 వేల చొప్పున ఐదు లక్షల టికెట్లను టిటిడి విడుదల చేయనుంది.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్ - మహారాష్ట్ర సరిహద్దులోని బీజాపూర్ జిల్లా అడవుల్లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

మహారాష్ట్రకు చెందిన సి-60 కమాండోలు, బీజాపూర్ పోలీసు బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా నేషనల్ పార్కులోని తక్‌మెటా ప్రాంతంలో మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎదురుకాల్పుల్లో తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టు అగ్రనేత మైలారపు ఈడెలు అలియాస్ భాస్కర్ భార్య కాంతి లింగ్వా (40) అలియాస్ అనిత మృతి చెందనట్లు సమాచారం. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలంలో మావోయిస్టుల మృతదేహాలు, ఆటోమేటిక్ రైఫిల్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

రాష్ట్రంలో ఐటి కుదేలు : జివిఎల్ విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఐటి రంగం కుదేలైందని బిజెపి ఎంపీ జివిఎల్ నరసింహారావు విమర్శించారు. ఐటి రంగానికి సంబంధించి ఎగుమతులు కానీ, దిగుమతులు కానీ రాష్ట్రంలో సున్నా అని ఆయన పేర్కొన్నారు. విజయవాడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఐటి రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంతో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రాభివృద్ధిపై టిడిపికి, వైసిపికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కాపుల రిజర్వేషన్ అంశంలో జగన్ మోసం చేశారన్నారు. 2024 తర్వాత జగన్ హైదరాబాద్‌కు వెళ్లి కూర్చోవడం ఖాయమన్నారు. 25న మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా సుపరిపాలన దినం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారు

ఆత్మహత్యల్లో దేశంలోనే ఎపి టాప్ : సిపిఐ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతాంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రమూ పట్టించుకోవడంలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని సిపిఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకోవడంలో దేశంలోనే ఎపి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో రైతులు ఎవరూ సంతోషంగా లేరని, అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఎక్కడికెళ్లినా ఎన్నికల ఉపన్యాసాలు చేస్తున్నారే తప్ప రైతుల సమస్యలపై మాట్లాడం లేదన్నారు. రైతులు, ఇళ్ల సమస్యలపై ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగునున్న తమ పార్టీ రాష్ట్ర కార్యవర్గ, సమితి సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. 27న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ దౌర్జన్యాలు, దురాగతాలు, అరాచకాలపై చర్చించి తగు రీతిలో స్పందిస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శివారెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

మంచు కురిసే వేళలో...

మంచు కురిసే వేళలో ప్రకృతి ప్రియులను ఉల్లాసపరిచే పొగమంచు సోయగాలు కనులకు విందు.. మనసుకు ఆహ్లాదం. ముత్యాలు రాలినట్లుగా పడే మంచు తుంపర్లు... గజగజ వణికించే చలి... వేడివేడిగా పొగలుగక్కుతున్న కాఫీ... మనసును ఉల్లాసపరుస్తుంది. ఈ అద్భుతమైన వాతావరణం కారణంగా ప్రతి ఒక్కరూ మెత్తగా హత్తుకునే గాలిలోని ఏదో ఒక అద్భుతాన్ని అనుభవిస్తారు. తక్కువ ఉష్ణోగ్రతలు, గాలిలో కలిసి చల్లగా తాకే మంచు, మంచు కురుస్తున్న వాతావరణంతో శీతాకాలం ప్రకృతి మత్తుగా... నిద్రపోతున్నట్టుగా వుంటుంది. సూర్యుడు సైతం చురుకుగా వుండడు. కప్పేస్తున్న మంచుగాలులను చీల్చుకొని అప్పుడప్పుడు బయటకు తొంగిచూస్తుంటాడు. అందుకే అంటాడో కవి... 'శీతాకాలం సూర్యుడిలాగా... కొంచెం కొంచెం చూస్తావే' అని. రోజులు చల్లగా వుంటాయి. అందుకేనేమో ఎక్కువమంది శీతాకాలాన్ని ఇష్టపడతారు. 'ఎంతో రసికుడు దేవుడు... ఎన్ని పువ్వు లెన్ని రంగు లెన్ని సొగసులిచ్చాడు... అన్నిటిలో నిన్నే చూడమన్నాడు' అంటాడో సినీ కవి. ఈ కాలంలో ప్రకృతి కూడా కొత్త సొబగులతో... సరికొత్త అందంతో వెండివెలుగులతో నిండి వుంటుంది. ఈ కాలాన్ని ఇష్టపడే పువ్వులు, చెట్లు చాలానే వుంటాయి. మంచుతో కప్పబడి కూడా కనువిందు చేస్తుంటాయి.

ఈ కాలంలో హిమాలయ పర్వత ప్రాంతాలే కాకుండా దేశంలోని పలు ప్రాంతాలను మంచు దుప్పటి కప్పేస్తుంది. మంచు కప్పిన హిమాలయాలు పోతపోసిన వెండికొండల్లా అందమైన చిత్రం గీసినట్లు కనిపిస్తుంటాయి. ఆ దృశ్యాన్ని మంచువానలో తడుస్తూ... భూలోక స్వర్గాన్ని ఆస్వాదిస్తూ... కనులారా చూసి, మనసారా తరించమని ప్రకృతి ఆహ్వానిస్తుంటుంది. ఈ సమయంలో మన ఏజెన్సీ ప్రాంతంలోని వంజంగి, లంబసింగి, చింతపల్లి, పాడేరు, అరకు ప్రాంతాలు పర్యాటకులతో పోటెత్తుతాయి. సూర్యోదయ వేళ మంచు అందాలను తిలకించేందుకు తెల్లవారుజాము నుంచే పర్యాటకులు తరలివస్తారు. ఈ సమయంలో పొగమంచులో బందీ అయిన ప్రకృతి మరింత అందంగా... రమణీయంగా దర్శనమిస్తుంది. పదునెక్కే ఉషోదయ కిరణాలు... చురుక్కుమనిపించే శీతలగాలులు... ప్రియురాలి పంటిగాటులోని మధురిమలా గమ్మత్తుగా వుంటాయి. అలాగే ప్రకృతిలోనైనా, జీవితాల్లోనైనా వైరుధ్యాలు నిరంతరంగాను... సమాంతరంగానూ సాగిపోతుంటాయి. ఇంత చలిలోనూ క్రిస్మస్ జరుపుకొని, కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్న ఉత్సాహం ఒకవైపు, పెరుగుతున్న చలిగాలుల తీవ్రత మరోవైపు సాగుతూనే వుంటాయి.

'జ్వలన శిఖిశిఖా సముదయమ్ము నెత్తి, బెబ్బులినివోలె దూకు' చలిని, మంటలతో ఎదుర్కొంటుండగా 'చూపులకు నక్కి వెన్నుపోటు పొడిచె చలి ప్రజాతతిన్' అంటారు బులుసు వెంకటేశ్వర్లు. చలికి తట్టుకోలేక నెగళ్లు వెలిగించినప్పుడు మంటకు ఎదురుగా ఉన్న శరీరభాగం వెచ్చబడుతుంది. అయితే, చలి వెనుక నుంచి దాడి చేస్తుంది. అలాగే, వాతావరణ మార్పులతో భారత్‌లో ఇప్పటికే తీవ్ర ఎండలు, కుండపోత వానలు అధికమయ్యాయి. చలి సైతం పంజా విసురుతోంది. రాబోయే రోజుల్లో వడగాడ్పుల ప్రతాపం మరింత విజంభిస్తుందని ప్రపంచబ్యాంకు నివేదిక తాజాగా హెచ్చరించింది. కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తిని... కాలచక్రం గతులు తప్పుతోంది. మంచు కాలంలో విపరీతంగా మంచుకురవడం.. వర్షాకాలంలో అధిక వర్షాలు పడటం.. ఎండాకాలంలో ఎక్కువ ఎండలు కాయటం దీని ప్రభావమే. అందులో భాగంగానే ప్రస్తుతం అధిక చలి, ఎక్కువ మంచు. ఇది ఎంత ఆహ్లాదకరంగా వుంటుందో, ఎంత ఉల్లాసాన్నిస్తుందో... అంతే ప్రమాదకరమైనది కూడా. అమెరికాలో మంచు విపరీతంగా కురియడం, చలిగాలులు ఉధృతం కావడంతో 12 రాష్ట్రాల్లో అత్యయిక స్థితిని ప్రకటించారు. రుతువుల వర్ణనలు చూడటానికి, వినడానికి ఎంత బావుంటాయో... అనుభవం మాత్రం కొన్ని సందర్భాల్లో అంతకంటే దుర్భరంగా వుంటుంది. 'ప్రక్కలు వంచు, వంచి ముని పండ్లను పండ్లను రాచు... క్రమంగా తలను కాళ్ల సందులోకి దూర్చేలా చేస్తుంది' అంటూ వల్లభరాయ కవి క్రీడాభిరామంలో చెప్పిన సత్యం... వృద్ధులకే కాదు... చలి, మంచు అంటే వణికిపోయేవారికీ అనుభవమే. ఏ కాలంలో అయినా మంచి చెడులు వుంటాయి. సమయా సమయాలను బట్టి ఆయా కాలాలను ఆస్వాదించాలి... ఆనందించాలి. అదే సమయంలో ఆరోగ్యం అన్నిటికంటే ముఖ్యం. శీతాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు, తమ శరీరానికి చలి, మంచు పడనివారు అధిక జాగ్రత్తలు తీసుకోవాలి. తస్మాత్ జాగ్రత్త!!

మంచి మాట



అధ్యయనం లేకుండా ఒక పరిష్కారం కనుగొనాలనుకునేవారు...ఒక ఆలోచనకు రావాలనుకునేవారు...కేవలం తెలివితక్కువ దద్దమ్మలు మినహా మరేమీ కారు. అలా చేస్తే సరైన పరిష్కారం లభించడం కానీ మంచి ఆలోచనకు రావడం గానీ జరగదన్న విషయం తెలుసుకోవాలి.

- మావో



సవాళ్లకు సిద్ధంచేసిన 2022

ప్రస్తుతం



తెలకపల్లి రవి

వచ్చే ఆదివారానికి మనం 2023లో ప్రవేశిస్తాం. అది ఎన్నికల సంవత్సరం కూడా అవుతుంది. లోక్‌సభ ఎన్నికలూ 2024 మొదట్లోనే పూర్తి కావాలి. పాలక పార్టీలన్నీ ఎన్నికల జ్వరంలో మునిగిపోయాయి. నిజానికి ఇప్పటికే ఆ వాతావరణం చూస్తున్నాం. వివాదాలు పరాకాష్టకు చేరాయి. రాజకీయ సామాజిక జీవితంలోని ప్రతిరంగమూ ప్రకంపనలకు గురయింది. గతంలో ఎంత చెప్పినా అర్థం కాని అంశాలు ఇప్పుడు కొంత బోధపడుతున్నాయి. కోల్‌కతాలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో బిగ్ బి అమితాబ్ బచన్ దేశంలో ప్రాథమిక హక్కుల పరిస్థితి గురించి, భావస్వేచ్ఛ గురించి ఆవేదన ప్రకటించడం అందులో ఒకటి. గోవా చిత్రోత్సవంలో జ్యూరీ చైర్మన్ ఇజ్రాయిలీ దర్శకుడు లిపిడ్ 'కాశ్మీర్ ఫైల్స్' కేవలం చవకరకం ప్రచార చిత్రమని ధైరంగా కొట్టిపారేయడం మరొకటి. అత్యున్నత న్యాయస్థానం పౌరహక్కుల రక్షణ చేయలేకపోతే మేమెందుకని కేంద్రాన్ని ప్రశ్నించడం ఇంకోటి. ఈ మూడు సందర్భాలు కూడా దేశం ముందున్న ప్రధాన సవాలును సూటిగా చెబుతున్నాయి. తెలుగునాట చూస్తే గురజాడ పురస్కారాన్ని ఛాందస ప్రవచనకారులకు ఇవ్వడంపై విస్తృత స్థాయిలో నిరసన వ్యక్తం కావడం పునరుద్ధరణవాద శక్తులపై ప్రగతివాదుల కదలికను చెబుతుంది. ఇదే సమయంలో సినిమా రంగంలో మతతత్వ భావాలతో కూడిన పునరుద్ధరణవాద సినిమా ప్రపంచ స్థాయికి చేరడం ఆందోళనా పెంచుతున్నది. మీడియా మోడియాగా మారే క్రమం కొనసాగింది. ప్రత్యామ్నాయంగా ఉండాల్సిన సోషల్ మీడియాను కూడా పెద్ద పార్టీలు, వ్యాపార శక్తులు పక్కదోవ పట్టిస్తున్నాయి.

మార్కెట్ శక్తుల చెలగాటం ప్రపంచ కుబేరుల జాబితాలోని భారతీయ మహా సంపన్నులు లక్షల కోట్లకు ఎగబాకడం శరవేగంగా జరిగింది. బ్యాంకులు వారికి 13 లక్షల కోట్లకు పైగా కట్టబెట్టిన ఉదంతం అధికారికంగానే వెల్లడైంది. ఇక విశాఖ ఉక్కు బేరం కొనసాగుతున్నది. స్వయంగా కేంద్ర నేతలు ఖండించినా సింగరేణి గనులలో కొంత భాగం వేలానికి పెట్టడం ఈ కాలంలోనే జరిగింది. ఓడరేవులు, గనులు, విమానాశ్రయాలు అన్నీ ప్రయివేటు చేతుల్లోకి వెళ తున్నాయి. సంఘ పరివార్ మతతత్వం మార్కెట్ శక్తుల విశృంఖలత కలగలసిన మోడీ పాలన ఈ ఏడాది మరింత వెర్రితలలు వేసింది.

ఎన్నికలలో కొత్త పరిణామాలు

దేశం వివిధ ప్రాంతాలలో ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగితే బిజెపి అయిదు తెచ్చుకుంది. గుజరాత్‌లో కాంగ్రెస్ బలం మూడో వంతుకు పడిపోతే బిజెపి బలం బాగా పెంచుకొంది. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం కొంత ఊరట, ఢిల్లీ మునిసిపల్ ఎన్నికలలో విజయం, అంతకు ముందు పంజాబ్‌లోనూ అధికారం చేపట్టి గుజరాత్‌లో 13 శాతం ఓట్లు తెచ్చుకోవడంతో ఆప్‌కు జాతీయ హోదా లభించింది. బిజెపిని ప్రధాన ప్రత్యర్థిగా ప్రకటించకుండా మామూలు మాటలకే ఆప్ రాజకీయ విధానం పరిమితమవడం సందేహాలు కలిగించింది. కేరళలో సిపిఎం రెండోసారి విజయం సాధించి సుదీర్ఘకాల వరవడిని మార్చింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ ఏడాదిలో బిజెపితో తెగతెంపులు చేసుకుని మళ్లీ తేజస్వి యాదవ్ ఆర్జేడీతో కలిశారు. బిజెపిపై తీవ్ర విమర్శలు చేయడం మొదలెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చి మోడీ విధానాలపై విరుచుకుపడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బీహార్ వెళ్లినపుడు కూడా ఈ ప్రసక్తి రాగా ఆయన దాటవేశారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కెసిఆర్‌తో నడుస్తున్నారు. బిఆర్ఎస్ ఎ.పి కి విస్తరించాలని చూస్తోంది.

ప్రాంతీయ పార్టీల పాట్లు

మరో వంక తెలంగాణలో అస్త్ర సన్యాసం చేసి ఎ.పి కే పరిమితమైన చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ ఖమ్మం సభతో పున:ప్రారంభం చేశారు. ఆరెస్సెస్ బాధ్యులొకరు ఇచ్చిన సలహా మేరకే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది ఎ.పి ఎన్నికలలో బిజెపితో మెప్పు కోసమేనని కూడా చెబుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌తో కలిస్తేనే తమకు గట్టి మెజార్టీ వస్తుందని టిడిపి అంతర్గత సర్వే తేల్చిందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఏమైనా టిడిపి రాజకీయం అక్కడే పరిభ్రమిస్తున్నది. మరోవైపున వైఎస్ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం కూడా రాజకీయ ప్రశ్నలకు దారితీసింది. వైసీపీ ప్రభుత్వం బిజెపికి కేంద్రంలో అనుకూలంగా వుంటూనే తెలంగాణపై ఆసక్తి లేదని ప్రకటించింది. జనసేన పవన్ కల్యాణ్ ఇప్పటికీ ఓట్లు చీలనివ్వబోనని ఒకసారి, ప్రజల మద్దతు వుంటే తనే ముఖ్యమంత్రి అవుతానని మరోసారి రకరకాలుగా మాట్లాడుతూ తమ శ్రేణులనూ ఇతరులనూ కూడా తికమక పెట్టారు. ప్రధానంగా కాపులను తమ వైపు తిప్పుకోవడానికి వివిధ రాజకీయ పార్టీలు తమతమ వ్యూహాలతో హంగామా చేస్తున్నాయి. ఇతరత్రా కూడా కుల రాజకీయాలు బాగా పెరిగాయి. తెలంగాణ ఎ.పి మళ్లీ కలిసే అవకాశముంటే తాము ముందుంటామని వైసీపీ చేసిన ప్రకటన, దానిపై తెలంగాణ నేతల దాడి మరోసారి విభజన రోజులను గుర్తు చేసింది. ఎ.పి ప్రభుత్వం విభజన సమస్యల పరిష్కారంలో జాప్యంపై సుప్రీం కోర్టులో తెలంగాణపై కేసు వేసింది. మూడు రాజధానుల బిల్లు ఉపసంహరణ ఆరు నెలల గడువులోపు అమరావతినే కట్టాలంటూ ఎ.పి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు ఆ మేరకు నిలిపేసింది. మార్గదర్శికీ వైసీపీకి ఘర్షణ పునరావృతమైంది. తెలంగాణలో బిఆర్ఎస్ ఎంఎల్ఎల కొనుగోలుకై బిజెపి దళారులు దిగిపోవడం సంచలనం సృష్టించింది. మునుగోడు ఉప ఎన్నికలలో కమ్యూనిస్టుల మద్దతుతో బిఆర్ఎస్ గట్టెక్కడమే గాక భవిష్యత్ సమీకరణాలను గురించి ప్రశ్నలు లేవనెత్తింది. కెసిఆర్ కుమార్తె కవితను ఢిల్లీ ఉప ముఖ్యమంత్రితో పాటు లిక్కర్ స్కామ్ ఛార్జిషీట్‌లో చేర్చడం, వైసీపీ ఎం.పి విజయసాయిరెడ్డి దగ్గర బంధువులను దాంట్లో ముద్దాయిలుగా చేర్చడం దేశం దృష్టిని ఆకర్షించింది.



విపరీతంగా పెరిగిన నిరుద్యోగం, పెరిగే ద్రవ్యోల్బణం, అధిక ధరల పోటు వీటి మధ్య మోడీ సర్కారు గొప్పలు కుప్పకూలుతున్నాయి. పాలక వర్గాలు తమ జీతభత్యాలపైనా గతంలో సాధించుకున్న హక్కులపైనా ఉపాధి, ఉద్యోగ భద్రతలపైనా చేస్తున్న దాడులను కార్మికవర్గం గట్టిగా ప్రతిఘటించింది. గత ఏడాది మోడీ హామీలతో తీవ్ర ఆందోళన విరమించిన రైతాంగం హామీలు వమ్ము చేసిన కేంద్రంపై మరోసారి పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. మహిళలు తమపై కొనసాగుతున్న దాడులనూ అవకాశాల నిరాకరణనూ నిరసిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. చివరగా ముంచుకొస్తున్న కరోనా ముప్పును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతున్నారు. అందుకే అనేక విధాల 2022 కొత్త సవాళ్లకు సమాయత్తం చేసిన కాలంగా మిగిలిపోనుంది.

అంతర్జాతీయ రంగంలో..

అంతర్జాతీయంగా ఫిబ్రవరిలో మొదలైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతూనే వుంది. భారతదేశం యుద్ధ విరమణ జరగాలంటూనే రష్యా దగ్గర చమురు కొనే హక్కును నిలబెట్టుకుంది. జి20 నాయకత్వం దేశానికి రావడం, దానిపై ప్రధాని అఖిలపక్ష చర్చ నిర్వహించడం బట్టి చూస్తే ఎన్నికలలో దీన్ని ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకోవడం తథ్యమని స్పష్టమైంది. భారత చైనా సరిహద్దులలో కొన్ని ఘర్షణలు పునరావృతమైనా రెండు దేశాలు వాటిని శ్రుతి మించకుండా జాగ్రత్త పడ్డాయి. ఈ విషయంలో బిజెపి దాగుడుమూతలు ఒకవైపు, కమ్యూనిస్టేతర ప్రతిపక్షాల అతి స్పందన మరోవైపు, మీడియా అత్యుత్సాహం ఇంకోవైపు వివాదాన్ని పెద్దగా చూపుతున్నా అదే సమయంలో ఇరుదేశాల సంప్రదింపులు కూడా కొనసాగుతున్నాయి. చైనా అధ్యక్షుడుగా సీ జిన్ పింగ్ మరోసారి ఎన్నిక కావడం గురించి బడా మీడియా ఉధృత కథలువదలినా చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభ వాటిని వమ్ము చేసింది. ఇప్పుడు మళ్లీ కరోనా ఆంక్షలపై తిరుగుబాటు అనీ, వాటిని సడలించిన తర్వాత విచ్చలవిడిగా కరోనా విజృంభణ అని గతంలో లాగే విపరీత ప్రచారం కొనసాగుతోంది. గొప్ప సంపదగా ప్రచారమైన క్రిప్టో కరెన్సీ ఇంతలోనే కూలిపోయింది. రిజర్వుబ్యాంకు భారతీయ డిజిటల్ నోట్‌ను లాంచనంగా విడుదల చేసింది. కరోనా కాలంలో ఎన్నో ఒడుదుడుకులు చూసిన ఐ.టి రంగంలో 2008 మాంద్యాన్ని మించిన తొలగింపులు ఖాయమంటున్నారు. దేశంలో కోవిడ్ వేరియంట్ ప్రవేశం ఘటనలు పెరగడంతో గతానుభవాల నేపథ్యంలో తీవ్రమైన సందేహాలు అలుముకుంటున్నాయి. ప్రధాని మోడీ తనదైన శైలిలో భిన్న సంకేతాలు ఇస్తూ ఉత్కంఠ పెంచుతున్నారు.

వివిధ రంగాల పరిస్థితి

మత సామరస్యంపైనా లౌకిక వాదుల పైన దాడులు ఈ కాలంలో పెరిగాయి. ప్రార్థనా స్థలాల చట్టం-1991 వున్నా కాశీ, మధుర మందిరాలపై కోర్టులు విచారణ చేశాయి. కాశ్మీర్‌లో 370 రద్దు, పౌరసత్వ సవరణచట్టం సమీక్ష, ఎన్నికల బాండ్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంలో లొసుగులు, నగదు రద్దు నిర్ణయం సమీక్ష వంటి కేసులన్నీ ఇంకా విచారణలోనే వున్నాయి. బిజెపి యేతర పార్టీలపై ఇ.డి, ఐ.టి, సిబిఐలను ప్రయోగించే త్రిశూల వ్యూహం తీవ్రంగానే అమలైంది. రాష్ట్రాలకు నిధుల కోత, హక్కులపై కేంద్రం దాడి మరింత ఉధృతమైంది. గవర్నర్ల జోక్యం పరాకాష్టకు చేరింది. న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నం పెద్ద ఎత్తున సాగుతున్నది. సుప్రీం కోర్టు ఈ ఏడాదిలో ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులను చూసింది. ప్రజల తరపున పోరాడే కొద్ది మందికి ఉపశమనం లభించినా అనేక మంది నిర్బంధంలోనే వున్నారు.


భారతీయ సినిమా రంగం కరోనా దెబ్బ నుంచి కోలుకుని మళ్లీ ఉత్సాహం పుంజుకోవడమేగాక ఓటిటి ప్రభావం పెరిగింది. సినిమా రంగంలో ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప, కెజిఎఫ్2, కాంతార...వంటివి అంతర్జాతీయ రికార్డులు సాధించి బాలీవుడ్‌నే గాక హాలీవుడ్‌ను కూడా కుదిపేశాయి. కాకుంటే మొదట ప్రస్తావించుకున్నట్టు వీటిలో పునరుద్ధరణవాద ధోరణులూ పెరిగాయి. కొద్దో గొప్పో సామాజిక న్యాయ భావనను, దిగువ వర్గాల అభ్యున్నతిని చెప్పిన దర్శకులు కూడా వ్యాపార అవసరాల కోసం వాతావరణంలో ఇమిడిపోవడం కోసం ఇటాటి సినిమాలకు పట్టం కట్టడం ఆందోళనకరం. హీరో కృష్ణ, కృష్ణంరాజు, సత్యనారాయణ వంటి దిగ్గజాలు ఈ ఏడాది దూరమైనారు. మధురాంతకం నరేంద్ర నవలకూ వారాల ఆనంద్ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు దక్కడం హర్షం కలిగించింది. వివిధ రంగాల్లో ప్రతిభావంతులు, యువశక్తులు ప్రతికూల పరిస్థితులలోనూ పలు విజయాలు సాధించారు.

విపరీతంగా పెరిగిన నిరుద్యోగం, పెరిగే ద్రవ్యోల్బణం, అధిక ధరల పోటు వీటి మధ్య మోడీ సర్కారు గొప్పలు కుప్పకూలుతున్నాయి. పాలక వర్గాలు తమ జీతభత్యాలపైనా గతంలో సాధించుకున్న హక్కులపైనా ఉపాధి, ఉద్యోగ భద్రతలపైనా చేస్తున్న దాడులను కార్మికవర్గం గట్టిగా ప్రతిఘటించింది. గత ఏడాది మోడీ హామీలతో తీవ్ర ఆందోళన విరమించిన రైతాంగం హామీలు వమ్ము చేసిన కేంద్రంపై మరోసారి పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. మహిళలు తమపై కొనసాగుతున్న దాడులనూ అవకాశాల నిరాకరణనూ నిరసిస్తూ ఆందోళన బాట పడుతున్నారు. చివరగా ముంచుకొస్తున్న కరోనా ముప్పును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతున్నారు. అందుకే అనేక విధాల 2022 కొత్త సవాళ్లకు సమాయత్తం చేసిన కాలంగా మిగిలిపోనుంది.

★

ఎం.ఎస్.పి కోసం మరో ఉద్యమం

సమస్య



వి.కృష్ణయ్య

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 35వ జాతీయ మహాసభ కేరళ లోని త్రిసూర్ లో డిసెంబర్ 13 నుంచి 16 వరకు జయప్రదంగా జరిగిన విషయం తెలిసిందే. వ్యవసాయ బిల్లుల వ్యతిరేక రైతు ఉద్యమానికి మోడీ ప్రభుత్వం ఆ సమయానికి తలవంచినా...ఇప్పటిదాకా రాతపూర్వక హామీలను అమలు చేయకపోవడం దేశానికి, రైతాంగానికి ద్రోహం చేయడమేనని, వాటిని సాధించుకునేదాకా పోరాడాలని మహాసభ తీర్మానించింది.

మూడు కీలక అంశాలపై 3 కమిషన్లు వేసి చర్చించి వాటి సారాంశాన్ని మహాసభకు సమర్పించింది. 1) భూమి, భూసంబంధ సమస్యలు, భూసేకరణ విధానం, రైతులకు జరుగుతున్న అన్యాయాలు. 2) అన్ని పంటలకు కనీస మద్దతు గ్యారంటీ చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన అవసరం, 3) వ్యవసాయ రంగంలో ఫైనాన్షియల్ పెట్టుబడి - జొరబడుతున్న తీరు, రైతాంగం దోపిడీకి గురవుతున్న వైనం. ఈ మూడు కమిషన్ల నివేదికలు ప్రతినిధుల ఆలోచనా శక్తిని పెంచడానికి దోహదపడ్డాయి. అనవసరంగా వచ్చి పడుతున్న విదేశీ వ్యవసాయ వస్తువులను నిలిపివేయాలని, గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు తగ్గించడం కాదు పెంచాలని, కార్పొరేట్లకు ప్రత్యామ్నాయంగా కోపరేటివ్లను అభివృద్ధి చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికులను ఉత్పత్తిలో భాగస్వాములను చేసే మెరుగైన చట్టాలను చేయాలనే తీర్మానాలను మహాసభ చర్చించి ఆమోదించింది.

చర్చలలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు వారి విలువైన అనుభవాలను ప్రస్తావించారు. వ్యవసాయ రంగం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రీతిన ఉంది. కాశ్మీరు, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో యాపిల్ పంట అధికంగా పండించిన రైతులు ప్రభుత్వ విధానాల వలన అప్పుల పాలవుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లాంటి చోట్ల పత్తి రైతులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, ఇతర దుంపలు, వ్యవసాయం గిట్టుబాటు కాకున్నాయి. వరి, ధాన్యం, గోధుమలు పంజాబ్ హర్యానా పశ్చిమ యు.పి లాంటి చోట్ల ప్రొక్యూర్‌మెంట్‌లో, ప్రభుత్వాల మద్దతు ధరకు కొంటున్నారు. ఇతర విశాల భారత దేశంలో ఎక్కడా ఇది అమలు కావడం లేదు. దేశంలో తొమ్మిది కోట్ల మందికి పైగా రైతులు పాల ఉత్పత్తిపై ఆధారపడి ఉన్నారు. ఒక లీటరు ఆవు పాలు ఉత్తరప్రదేశ్‌లో రూ.15 రూపాయలు ఉన్నాయంటేనే పరిస్థితి అర్థమవుతుంది. అదే కేరళలో రూ.36 (3.5 శాతం వెన్న) ఉంది. మేత, దాణా, ఇతర ఖర్చులు పెరిగి సంవత్సరానికి 50 లక్షల కుటుంబాలు ఈ రంగం నుంచి బయటకు వస్తున్నారు. 5 శాతం జిఎస్‌టి విధించిన తరువాత పిల్లలు తాగే పాలు కూడా భారమైపోతున్నాయి. పోరాటం చేసి రంగాన్ని కాపాడుకోవాలని చెప్పారు.

మోడీ ప్రభుత్వం రైతుకు రెట్టింపు ఆదాయం వచ్చేట్లుగా చేస్తానన్నది. కానీ ఆచరణలో బూటకంగా తయారయింది. రైతుల ఆత్మహత్యలు పెద్ద సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయి. ఈ సంక్షోభం నుంచి బయట పడాలంటే కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ తరహాలో రుణ విముక్తి చట్టం చేయాలని ప్రతినిధులు కోరారు.



కేరళలో సహకార వ్యవస్థ సుమారు వంద సంవత్సరాల పైన చరిత్ర కలది. అది క్రమంగా నూతన పద్ధతుల ఒరవడిని, విధానాలను తోడు చేసుకుని అభివృద్ధి పథంలో సాగుతున్నది. ఈనెల 17వ తేదీన ఆంధ్ర, తెలంగాణ ప్రతినిధులు 28 మంది మూడు సహకార సొసైటీలను, ఒక పంచాయతీ ఆఫీసును, ఒక ప్రాథమిక పాఠశాలను దర్శించడం జరిగింది. మొదట విజిట్ చేసిన సొసైటీ గ్రామీణ స్థాయిలో ఉంది. దానిలో పదివేల మంది సభ్యులు ఉన్నారు. వారి సరాసరి సొంత భూమి తలసరి విస్తీర్ణం 6.8 సెంట్లు. 160 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

బ్యాంక్ ఒక్కో రైతుకు కనీసంగా పదివేల నుంచి 15 వేల వరకు వడ్డీ లేని రుణం ఇస్తుంది. సకాలంలో చెల్లించాలి. బ్యాంకు తో పాటు మంచి సూపర్ మార్కెట్లు, మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. చిన్న రైతు బజార్ నిర్వహిస్తున్నారు. నాబార్డ్ బ్యాంకు నుంచి కొత్త ప్రాజెక్టు వచ్చింది. కొబ్బరి నూనె తీసే ఫ్యాక్టరీ పెట్టడానికి స్థలం, యంత్రాల కొనుగోలుకు 2.3 కోట్లు కేటాయించబడింది. ప్రతి సంవత్సరం ప్రతి రైతుకు 20 వేల రూపాయలు బోనస్ వస్తుంది. సభ్యులు ఎవరైనా చనిపోతే పది వేల రూపాయలు ఇస్తుంది. పంచాయతీ ఆఫీసే ఒక మండల స్థాయిలో ఉంది. పంచాయతీ స్థాయిలోనూ విద్య, వైద్యం, ఆర్ అండ్ బి లాంటి విభాగాలకు స్టాండింగ్ కమిషన్ల పర్యవేక్షణ ఉన్నది. ప్రజల అజమాయిషీలో పరిపాలన సాగటమంటే ఏమిటో ఆచరణలో అక్కడ మేము చూశాం. వరి ధాన్యం క్వింటాలు రూ.2840కు రాష్ట్ర ప్రభుత్వం కొంటున్నది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్నది. వ్యవసాయ పంటలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం, పంటలకు అదనపు విలువలతోబాటు మిషనరీని తోడు చేయడం, వివిధ నూతన పద్ధతులను పాటించడం చేస్తుంది. సహకార సంస్థలను, ఎఫ్.పి.ఓ లను నూతన ఒరవడిలో నడుపుతూ రైతాంగానికి అదనపు ఆదాయం చేకూరేలా చూస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన రైతాంగానికి ఆయా రాష్ట్రాలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదాహరణకు- అఖిల భారత స్థాయిలో సరైన విత్తన చట్టం ఇంతవరకు లేనందున (పార్లమెంటులో ప్రవేశపెట్టారు) కల్తీ విత్తనాల సమస్య అన్ని రాష్ట్రాలలో కనిపిస్తున్నది. ఎరువుల ధరలు దాదాపుగా రెట్టింపయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ప్రకృతి వ్యవసాయం పైనే ఆధారపడితే శ్రీలంక ఆహార సంక్షోభం లాంటి ప్రమాదం వచ్చి ఉండేది. అధునాతన నూతన మార్కెట్ల విధానం విఫలమైంది. అది రైతులకన్నా వ్యాపారస్తులకు బాగా దోహదపడుతున్నది. ఆవును రాజకీయ పావుగా మార్చి మైనారిటీలపై దాడులు పెంచారు. వట్టిబోయిన ఆవులు, ఎద్దులు వ్యవసాయానికి పనికి రాక రోడ్లపై వాహనాల ప్రమాదానికి కారణం అవుతున్నాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా కార్పొరేట్ కంపెనీలకు కోట్లు కురిపిస్తుండగా రైతాంగానికి వివిధ రాష్ట్రాలలో ఏవిధంగాను ఉపయోగపడడం లేదని ప్రతినిధులు గుర్తించడం జరిగింది.

వేల కిలోమీటర్ల పొడవున అమర వీరుల జాతాలు, సభలు, ప్రజా సమస్యల నివేదనలు, చివరలో బహిరంగ సభ...ప్రతినిధులను ఎంతగానో ఉత్సాహపరిచాయి. భవిష్యత్‌లో వివిధ రైతు సంఘాలను, కార్మిక సంఘాలను కలుపుకొని చేయబోయే విశాల పోరాటాల బాధ్యతతో, ఉత్సాహంతో ప్రతినిధులు వెనుదిరిగారు.

(వ్యాసకర్త ఎ.పి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు)

జనవాక్యం

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

రానున్న సంక్రాంతి పండుగకు దక్షిణ మధ్య రైల్వే వారు ఆంధ్ర ప్రదేశ్ లోని పదమూడు జిల్లాల వారి సౌలభ్యం కోసం ప్రత్యేక రైళ్లు నడపాలి. ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తి అయిపోయాయి. ఈ సంవత్సరం ఎన్నడూ లేనంతగా రద్దీ ఉంటుంది. ఎందుకంటే ఇటీవల కాలంలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఉపాధి కోసం ప్రజలు పెద్దయెత్తున ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారు. వారంతా పండుగ జరుపుకోవడానికి, బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడపడానికి సొంత ఊళ్ళకు వస్తారు. బస్ చార్జీలు సామాన్యులు భరించలేనంతగా పెరిగాయి. పిల్లాజెల్లా రావడానికి, పోవడానికి వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే! ఈ వాస్తవ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రైల్వే వారు ఒక వారం పాటు పండుగకు ముందు తర్వాత ప్రత్యేక రైళ్లు నడపాలి.

- గరిమెళ్ళ రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

సిబ్బంది లేకుండా సాధ్యమా?

రాష్ట్రాన్ని నార్కోటిక్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అయితే ఈ మత్తు పదార్థాల సరఫరాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకు ముఖ్య కారణం, యువతకు ఉపాధి అవకాశాలు లేక గంజాయి, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు మరలుతున్నారు. అలాగే పోలీసు సిబ్బంది కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల ఈ అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నది. పోలీసు శాఖలో దాదాపు 30 వేల పోస్టులు ఖాళీ ఉంటే ఇప్పుడు కేవలం 6511 పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ ఇచ్చారు! మరి తగినంత మంది సిబ్బంది లేకుండా మాటలతో అరికట్టడం సాధ్యమా?

- జి. భారతీదేవి

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

26న దేశవ్యాప్తంగా జిల్లాల్లో ట్రాక్టర్ మార్చ్‌లు

- హర్యానా జిందలో భారీ కిసాన్ మహాపంచాయత్
- ఎస్‌కెఎం జాతీయ సమావేశంలో నిర్ణయం
- విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్


మాట్లాడుతున్న ఎస్‌కెఎం నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనవరి 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ మార్చ్‌లు నిర్వహిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ప్రకటించింది. అదే రోజున హర్యానాలోని జిందలో భారీ కిసాన్ మహాపంచాయత్ నిర్వహిస్తామని, అదే రోజు పార్లమెంట్ మార్చ్ తేదీని ప్రకటిస్తామని ఎస్‌కెఎం వెల్లడించింది. కర్నాల్‌లోని గురుద్వారా డేరా కర్ సేవాలో ఎస్‌కెఎం జాతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్‌కెఎం నేతలు జోగిందర్ సింగ్ ఉగ్రహన్, విజూ కృష్ణన్, రావుల వెంకయ్య, సునీలం, రంజిత్ రాజు అధ్యక్షత వహించారు. ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, దర్శన్ పాల్, రాకేష్ తికాయత్, జోగిందర్ ఉగ్రహన్, యుధ్వీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం దేశంలోని అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. జిల్లా కలెక్టర్లకు మెమోరాండం ఇవ్వనున్నారు.

జనవరి 26న హర్యానాలోని జిందలో ఉత్తర భారత రాష్ట్రాల రైతుల భారీ కిసాన్ మహాపంచాయత్ నిర్వహించనున్నారు. అదే రోజు మార్చ్ నెలలో నిర్వహించనున్న పార్లమెంట్ మార్చ్ (కిసాన్ ర్యాలీ) తేదీలను ప్రకటిస్తారు. గతంలో ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, బిజెపి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేయడాన్ని ఎస్‌కెఎం ఖండించింది. హర్యానా బిజెపి ప్రభుత్వం రైతులపై తీసుకొచ్చిన గ్రామీణాభివృద్ధి సెస్‌ను ఉపసంహరించుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. రైతులపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, పోలీసుల అణచివేతను ఉపసంహరించుకోవాలని ఎస్‌కెఎం సమావేశం డిమాండ్ చేసింది.

ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ ఇవ్వాలి : ఎస్‌కెఎం నేతలు

ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ ఇవ్వాలని ఎస్‌కెఎం నేతలు రాకేష్ తికాయత్, విజూ కృష్ణన్, ఉగ్రహన్ డిమాండ్ చేశారు. ఎస్‌కెఎం సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. లఖింపూర్ ఖేరీలో రైతుల హత్యకు పాల్పడిన వారిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, అజయ్ మిశ్రా టెనీని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జైల్లో మగ్గుతున్న రైతులను విడుదల చేయాలన్నారు. కిసాన్ ఉద్యమానికి మద్దతిచ్చిన పంజాబ్ గాయకులు కన్వర్ గ్రేవాల్, రంజిత్ బావాలపై కేంద్ర ఏజెన్సీలు, ఐటి శాఖ దాడులు చేయడాన్ని ఖండించారు. ఎస్‌కెఎం ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు గత ఏడాది రిపబ్లిక్ డే రోజున బిజెపి ప్రభుత్వం చేసిన కుట్రను గుర్తు చేశారు. మహాపంచాయత్‌లో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. రైతుల సమస్యలను లేవనెత్తుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్న ఫాసిస్ట్, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా మహాపంచాయత్ ఒక దృఢమైన సందేశాన్ని పంపుతుందని పేర్కొన్నారు.

దేశవ్యాప్త రైతు పోరాటాలకు సంఘీభావం

దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతుల పోరాటాలకు ఎస్‌కెఎం సంఘీభావం తెలుపుతుందని చెప్పారు. ఐదు నెలలుగా మాల్‌బ్రోస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ లిక్కర్ తయారీదారునికి వ్యతిరేకంగా రైతుల పోరాటానికి సమావేశం సంఘీభావం ప్రకటించిందన్నారు. పందుల పెంపకందారులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు నేతృత్వంలో 80 రోజులుగా జరుగుతున్న జరుగుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. పాకిస్తాన్ నుంచి వలస వచ్చి లఖీపూర్ (జలంధర్)లో స్థిరపడిన 25కి పైగా కుటుంబాల ఇళ్లను పంజాబ్ ప్రభుత్వం కూల్చివేయడాన్ని ఎస్‌కెఎం ఖండించిందన్నారు. ఎస్‌కెఎం తదుపరి జాతీయ సమావేశం 2023 ఫిబ్రవరి 9న కురుక్షేత్రలో జరగనుందని, అప్పుడు భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సామాజిక పురోగతిలో తమిళనాడు, కేరళ టాప్

- ఆంధ్రాకు 23, తెలంగాణకు 26 ర్యాంకులు
- ప్రధాని ఆర్థిక సలహా మండలి నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక పురోగతి సూచిక (ఎస్‌పిఐ)లో తమిళనాడు, కేరళ అగ్రగామిగా నిలిచాయి. అస్సాం, బీహార్, జార్ఖండ్, రాష్ట్రాలు అట్టడుగున ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 23వ ర్యాంక్‌లోనూ, తెలంగాణ 26వ ర్యాంక్‌లోనూ నిలిచాయి. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన సోషల్ ప్రోగ్రెస్ ఇండెక్స్ (ఎస్‌పిఐ) నివేదికను ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఇఎసి-పిఎం) విడుదల చేసింది. ప్రాథమిక మానవ అవసరాలు, ప్రజా శ్రేయస్సు పునాదులు, అవకాశాలు వంటి మూడు కీలక కోణాల్లో సామాజిక పురోగతిని సంబంధించిన 12 విభాగాల ఆధారంగా రాష్ట్రాలు, జిల్లాలను సూచిక అంచనా వేస్తుంది. రాష్ట్ర స్థాయిలో 89, జిల్లా స్థాయిలో 49 అంశాలతో కూడిన విస్తృత ప్రాతిపదికన ఈ సూచికను రూపొందించారు. ఈ సూచిక ప్రాథమిక మానవ అవసరాలలో పోషకాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణ, తాగు నీరు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత భద్రత, ఆశ్రయం వంటి అంశాల్లో రాష్ట్రాలు, జిల్లాల పనితీరును అంచనా వేసింది. ప్రజా శ్రేయస్సు పునాదుల్లో ప్రాథమిక విజ్ఞాన సదుపాయం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ యాక్సెస్, ఆరోగ్యం, ప్రజా క్షేమం (హెల్త్ అండ్ వెల్నెస్), పర్యావరణ నాణ్యత వంటి అంశాల్లో దేశం పురోగతిని అంచనా వేసింది. వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపిక, సమగ్రత, అధునాతన విద్య అందించడం వంటి అంశాలపైనా దృష్టి పెట్టింది. ఆరు విభాగాలుగా దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ర్యాంకులను కేటాయించింది.

చాలా అధిక సామాజిక పురోగతి : పుదుచ్చేరి (65.99 స్కోర్), లక్షద్వీప్ (65.89 స్కోర్), గోవా (65.53 స్కోర్), సిక్కిం (65.10 స్కోర్), మిజోరం (64.19 స్కోర్), తమిళనాడు (63.28 స్కోర్), హిమాచల్‌ప్రదేశ్ (63.28 స్కోర్), చండీగఢ్ (62.37 స్కోర్), కేరళ (62.05 స్కోర్) చాలా అధిక సామాజిక పురోగతి విభాగంలో నిలిచాయి. ఇందులో పుదుచ్చేరి, లక్షద్వీప్, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాలు కాగా, గోవా, సిక్కిం, మిజోరం, హిమాచల్ ప్రదేశ్ చిన్న రాష్ట్రాలు. పెద్ద రాష్ట్రాల్లో తమిళనాడు, కేరళ మాత్రమే చాలా అధిక సామాజిక పురోగతి సాధించిన జాబితాలో ఉన్నాయి.

అధిక సామాజిక పురోగతి : జమ్ముకాశ్మీర్ (60.76 స్కోర్), పంజాబ్ (60.23 స్కోర్), దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ (59.81 స్కోర్), లడఖ్ (59.53 స్కోర్), నాగాలాండ్ (59.24 స్కోర్), అండమాన్ నికోబార్ దీవులు (58.76 స్కోర్) అధిక సామాజిక పురోగతి సాధించాయి. ఇందులో పంజాబ్, నాగాలాండ్ మినహాయిస్తే మిగిలినవన్నీ కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఉన్నాయి.

ఎగువ మధ్య సామాజిక పురోగతి : ఉత్తరాఖండ్ (58.26 స్కోర్), కర్నాటక (56.77 స్కోర్), అరుణాచల్ ప్రదేశ్ (56.56 స్కోర్), ఢిల్లీ (56.28 స్కోర్), మణిపూర్ (56.27 స్కోర్)తో అప్పర్ మిడిల్ సోషల్ ప్రోగ్రెస్ విభాగంలో నిలిచాయి.

దిగువ మధ్య సామాజిక పురోగతి : ఈ విభాగంలోనే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి. హర్యానా (54.15), గుజరాత్ (53.81), ఆంధ్రప్రదేశ్ (53.60), మేఘాలయ (53.22), పశ్చిమ బెంగాల్ (53.13), తెలంగాణ (52.11), త్రిపుర (51.70), ఛత్తీస్‌గఢ్ (51.36), మహారాష్ట్ర (50.86), రాజస్థాన్ (50.69) రాష్ట్రాలు లోయర్ మిడిల్ సోషల్ ప్రోగ్రెస్ విభాగంలో నిలిచాయి.

తక్కువ సామాజిక పురోగతి : ఉత్తర ప్రదేశ్ (49.16 స్కోర్), ఒరిస్సా (48.19 స్కోర్), మధ్యప్రదేశ్ (48.11 స్కోర్) రాష్ట్రాలు తక్కువ సామాజిక పురోగతిని సాధించాయి.

చాలా తక్కువ సామాజిక పురోగతి : అస్సాం (44.92), బీహార్ (44.47), జార్ఖండ్ (43.95)లు తక్కువ సామాజిక పురోగతిని సాధించాయని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ 23, తెలంగాణ 26వ ర్యాంక్ : ఎస్‌పిఐలో ఆంధ్రప్రదేశ్ 23, తెలంగాణ 26వ ర్యాంక్‌లో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ 53.60 స్కోర్ సాధించగా, తెలంగాణ 52.11 స్కోర్ సాధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక బేసిక్ అవసరాల్లో (59.30) సాధించింది. ప్రాథమిక బేసిక్ అవసరాల్లో పోషకాహారం, ప్రాథమిక వైద్య సంరక్షణలో (46.42), తాగు నీరు (61.13), పారిశుధ్యంలో (68.73), వ్యక్తిగత భద్రతలో (60.91) విభాగాల్లో సాధించింది. ఏపి ప్రజా శ్రేయస్సు పునాదుల్లో 46.52 స్కోర్ సాధించింది. ప్రజా శ్రేయస్సు పునాదుల్లో ప్రాథమిక విజ్ఞాన సదుపాయం (49.18), ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ యాక్సెస్ (40.96), ఆరోగ్యం, ప్రజా క్షేమం (హెల్త్ అండ్ వెల్నెస్) (39.17), పర్యావరణ నాణ్యత (56.75) సాధించింది. ఏపి అవకాశాల్లో 54.98 స్కోర్ సాధించింది. అందులో వ్యక్తిగత హక్కులు (52.25), వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపిక (62.47), సమగ్రత (52.93), అధునాతన విద్య (43.08 స్కోర్) నిలిచింది.

ఇటుక బట్టీలో పేలుడు.. తొమ్మిదిమంది మృతి

పాట్నా : బీహార్‌లోని మోతిహారి జిల్లా రాంఘర్వాలోని ఇటుక బట్టీలో చిమ్నీ పేలి తొమ్మిదిమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిదిమంది తీవ్ర గాయాల పాలయ్యారు. సంఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్, ఎస్‌పి వెళ్లి, పరిస్థితిని సమీక్షించారు. మృతుల్లో ఇటుకబట్టీ యజమాని మహ్మద్ ఇస్రార్ కూడా ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసులు, అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలందిస్తున్నారు. ఘటన పట్ల ప్రధాని, సిఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. క్షతగాత్రులు వేగంగా కోలుకునేలా పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సంబంధిత అధికారులను బీహార్ సిఎం నితీష్‌కుమార్ ఆదేశించారు.

కేరళ రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి

కేరళ : కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శబరిమల నుంచి తిరిగి వస్తున్న యాత్రికుల వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో తమిళనాడుకు చెందిన ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం శుక్రవారం అర్థరాత్రి సమయంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మరణించగా, ఒకరు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచారు. మృతులు తమిళనాడు థేనీ జిల్లా అండిపెట్టి ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

మసీదు స్థలం సర్వే

- శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా కేసులో మథుర కోర్టు ఆదేశం

లక్నో: ఉత్తర్ ప్రదేశ్ మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు వివాదంలో మథుర కోర్టు కీలక తీర్పు చెప్పింది. జనవరి 2 తర్వాత షాహీ ఈద్గా ప్రాంతంలో భారత పురావస్తు శాఖ సర్వే చేయాలని శనివారం ఆదేశించింది. జనవరి 20 తర్వాత నివేదిక సమర్పించాలని భారత పురావస్తు శాఖను ఆదేశించింది. గతంలో జ్ఞాన్‌వాపి మసీదులో సర్వే మాదిరిగానే ఈ సర్వే ఉండబోతోంది. హిందు సంస్థల తరుపున విష్ణు గుప్తా దాఖలు చేసిన వ్యాజ్యంపై కోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. ఈ కేసుల తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది కోర్టు. 17వ శతాబ్దానికి చెందిన షాహీ ఈద్గా మసీదును కత్రా కేశవ్ దేవ్ ఆలయం నుంచి తొలగించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బట్టబయలైన కాషాయ బూటకం !

- ఎల్గార్ పరిషద్‌కు, హింసకు సంబంధమే లేదు
- విచారణా కమిషన్ ముందు సాక్ష్యమిచ్చిన డిఎస్‌పి


రిటైర్డ్ పోలీసు అధికారి గణేష్ మోరే

న్యూఢిల్లీ : బీమా కొరెగావ్ కేసులో సీనియర్ పోలీసు అధికారి చెప్పిన సాక్ష్యంతో ఆ కేసు పునాదులు కదిలిపోయాయి. కాషాయ బూటకం బయటపడింది. పైగా పోలీసు అధికారి ఈ వ్యాఖ్యలు చేసింది ఎక్కడో కాదు ఈ కేసును విచారిస్తున్న జస్టిస్ జె.ఎన్.పటేల్, జస్టిస్ సుమీత్ మాలిక్‌లతో కూడిన ద్వి సభ్య విచారణా కమిషన్ ఎదురుగానే. 2018 జనవరి 1న బీమా కొరెగావ్‌లో చెలరేగిన హింసపై దర్యాప్తు చేయడానికి ఈ విచారణా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పూనేలో విచారణ జరుపుతున్న కమిషన్ ముందు ఈ నెల 20న హాజరైన రిటైర్డ్ పోలీసు అధికారి గణేష్ మోరే మాట్లాడుతూ, ఎల్గార్ పరిషద్‌కు, బీమా కొరెగావ్‌లో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. 2017 డిసెంబరు 31న పూనేలోని శనివార్ వాడాలో జరిగిన ఎల్గార్ పరిషద్ సమావేశం ఫలితంగానే జనవరి 1న అల్లర్లు చెలరేగాయనడానికి తనకెలాంటి సాక్ష్యాధారాలు లభించలేదని మోరే చెప్పారు. మొదటి ఎఫ్‌ఐఆర్‌లో కాకుండా తర్వాత తీసుకువచ్చిన ఎఫ్‌ఐఆర్‌లోనే ఎల్గార్ పరిషద్ 'సంబంధం' బయటకు తీసుకువచ్చారు. ఇక ఆ ఎఫ్‌ఐఆర్ ఆధారంగానే బీమా కొరెగావ్ కేసులో అరెస్టులు చకా చకా జరిగిపోయాయి. అల్లర్లకు, సమావేశాలకు సంబంధముందనే అభియోగాలతోనే మొత్తంగా 16మంది మేధావులు, కార్యకర్తలు జైల్లో మగ్గారు. వారిలో కొందరు 2018 నుండి యుఎపిఎ కింద జైలు శిక్ష అనుభవించగా, 84ఏళ్ళ ఫాదర్ స్టాన్ స్వామి మాత్రం కస్టడీలోనే మరణించారు. ఈ హింస చెలరేగిన సమయంలో గణేష్ మోరే పూనే జిల్లాలో భాగమైన దాండ్‌కు సబ్‌డివిజనల్ పోలీసు అధికారిగా వున్నారు. అంటే డిఎస్‌పి హోదాలో వున్నారు. 2018 జనవరి 1న ఆ ప్రాంత బందోబస్తుకు ఆయన సీనియర్ ఇన్‌చార్జిగా వున్నారు. ఆ రోజున ఉదయం 8గంటల నుండి 11.15గంటల వరకు డ్యూటీలో వున్నపుడు దాదాపు 1200మంది గుమిగూడి వుండగా, వారిని చెల్లా చెదురు చేసినట్లు ఆయన కమిషన్‌కు తెలిపారు. వారంతా కాషాయ జెండాలు ధరించి వచ్చిన వారే. ఆ తర్వాత, బీమా కొరెగావ్‌కు రావాల్సిందిగా ఆయనను అధికారులు పిలిచారు. అక్కడ హింస చెలరేగడంతో బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఆ ప్రాంతంలో సాయంత్రం 4వరకు వున్నారు. ఆ తర్వాత కాలంలో ఆ రోజున జరిగిన హింసాత్మక సంఘటనలపై దర్యాప్తుకు ఆయనను ఇన్‌చార్జిగా నియమించారు. ఆ రకంగా కమిషన్‌కు మోరే కీలకమైన సాక్షిగా నిలిచారు. గత అనేక మాసాలుగా ఆయనను కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ కూడా చేస్తోంది. 2018 జనవరి 1 దాఖలైన మొదటి ఎఫ్‌ఐఆర్‌లో హిందూత్వ నేతలు శంభాజీ భిడే, మిలింద్ ఎక్బోటేలు ఇందుకు బాధ్యులుగా పేర్కొన్నారు.

జ్ఞానవాపి మసీదు కేసులో తీర్పు రిజర్వ్

వారణాసి: జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలోని దేవతా విగ్రహాలకు నిత్యం ప్రార్థనలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించిన వారణాసి కోర్టు సవాల్ చేస్తూ జ్ఞాన్‌వాపి మసీదు కమిటీ దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు శుక్రవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ జెజె మునీర్ తన ఉత్తర్వులను రిజర్వ్ చేశారు.



సభలో మాట్లాడుతున్న పి.మధు

అమ్మభాషను పరిరక్షించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

మాతృభాషను రక్షించుకోవడానికి కవులే చైతన్య పర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కవులు భవిష్యత్తు తరాలను గుర్తించి వారికి భాష తెలియజేసే విధంగా రచనలు చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపి పి.మధు మాట్లాడుతూ విద్యా రంగంలో మార్పులు అంటూ కేంద్ర ప్రభుత్వం వివిధ విధానాలు తీసుకొచ్చి ఆంగ్లం, హిందీ భాషలను అన్ని రాష్ట్రాల్లో బలవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు. దీంతో, మాతృభాషకు ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏ ప్రాంతానికైనా ఆ ప్రాంత భాష ఉండే విధంగా విధానాలు ఉండాల్సిన అవసరముందని తెలిపారు. కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, ఐఎఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం విదేశీ ప్రతినిధుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తానా అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తోటకూర అధ్యక్షత వహించారు. అతిథులుగా అమెరికాకు చెందిన అంజయ్య చౌదరి, వెంకట ఆర్ యార్లగడ్డ, మురి వెన్నం, రవి పొట్లూరి, ఆస్ట్రేలియాకు చెందిన శ్రీనివాసరావు కాంద్రు, దుబాయ్‌కు చెందిన పానుగోయి సుబ్బారావు పాల్గొని తెలుగు భాష వైభవాన్ని విదేశాల్లో ఏ విధంగా అమలు చేస్తున్నదీ వివరించారు. నందమూరి తారకరామారావు వేదికపై చరిత్ర రంగ ప్రతినిధుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి చరిత్ర పరిశోధకులు ఆచార్య ఈమని శివనాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మండలి బుద్ధప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం 'సామాజిక మార్పులు-సాహిత్య ప్రక్రియలు' అనే అంశంపై జరిగిన సదస్సుకు తెలుగు కవి డాక్టర్ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు తెలుగు సాహిత్యం గురించి వివరించారు. మాతృభాషా పరిరక్షణకు పలు తీర్మానాలను ఈ మహాసభల్లో చేశారు. తీర్మానాలను మహాసభల ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి..పూర్ణచంద్ ప్రవేశపెట్టిగా ప్రతినిధులు చప్పట్లతో ఆమోదించారు. మహాసభల్లో సుమారు వెయ్యి మందికిపైగా రచయితలు, భాషాభిమానులు, కవులు పాల్గొన్నారని నిర్వాహకులు ప్రకటించారు.

విద్వేషాల వ్యాప్తే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నైజం

(మొదటి పేజీ తరువాయి)

సాకుగా చూపిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు.

యాత్రికులకు ఘనస్వాగతం

అంతకుముందు ఢిల్లీ పిసిసి అధ్యక్షుడు అనిల్ చౌదరి ఆధ్వర్యాన పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బదర్‌పూర్‌లోని ఢిల్లీ సరిహద్దు వద్ద రాహుల్ గాంధీకి, పాద యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎర్రకోట వరకూ 23 కిలోమీటర్ల దూరం యాత్ర సాగింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రా, వాద్రా దంపతుల పిల్లలు, కాంగ్రెస్ ఎంపిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గాంధీ, మాజీ ప్రధానులకు నివాళి

మహాత్మాగాంధీ, నెహ్రూ తదితర నేతలకు రాహుల్‌గాంధీ, యాత్రికులు ఆదివారం నివాళులర్పిస్తారు. రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి, వీర్ భూమి వద్ద రాజీవ్ గాంధీకి, శక్తి స్థల్ వద్ద ఇందిరా గాంధీకి, శాంతి వన్ వద్ద జవహర్‌లాల్ నెహ్రూకి, విజయ్ ఘాట్ వద్ద లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి, రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో వాజ్‌పేయికి నివాళులర్పిస్తారు. తొమ్మిది రోజుల విరామం తరువాత 2023 జనవరి 3న జోడో యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది. న్యూఢిల్లీ నుంచి మొదలై ఉత్తరప్రదేశ్, పంజాబ్ మీదుగా దాదాపు మరో 570 కిలోమీటర్లు పాదయాత్ర చేసి జమ్ము కాశ్మీర్‌లో ముగుస్తుంది. తమిళనాడులోని కన్యాకుమారిలో సెప్టెంబర్‌లో యాత్ర ప్రారంభమై, ఇప్పటి వరకు సుమారు 3,000 కిలోమీటర్ల మేర సాగింది.



మీకోసం

నూనె జిడ్డు బాగా అంటుకున్న పాత్రలను మొదట వేడినీటితో కడగాలి. ఆ తర్వాత అంట్ల సబ్బుతో తోమాలి.

జీవన సౌరభం

లేని గొప్పతనాన్ని ప్రదర్శిస్తే, నిజమైన గొప్పతనం మరుగున పడుతుంది.

క్రిస్మస్ వేడుకలు



పిల్లలూ, ఈ రోజు క్రిస్మస్ పండగ. ఆ సందడి విశేషాలు తెలుసుకుందామా!



క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపుకునే పండుగ. వివిధ దేశాల్లో ఈ సందర్భంగా నిర్వహించే వేడుకల్లో కొన్ని క్రైస్తవ పూర్వపు పద్ధతులు, కొన్ని లౌకిక విధానాలు ఉన్నాయి. ఈ వేడుకల్లో బహుమతులు ఇవ్వడం, ఎడ్వంట్ క్యాలెండర్ ఆవిష్కరించడం, కొవ్వొత్తులు వెలిగించడం, క్రిస్మస్ సంగీతం, గీతాలాపన, క్రీస్తు జననం ప్రదర్శన, సామూహిక ప్రార్థనలు, ప్రత్యేక విందు, క్రిస్మస్ చెట్టు వంటివాటితో కూడిన అలంకరణలు ఉంటాయి. క్రిస్‌మస్‌కు చాలా రోజుల ముందే పండుగ సందడి మొదలవుతుంది. దీనికోసం క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చిలను అందంగా అలంకరిస్తారు. వెదురు బద్దలు, రంగుల కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటిపై వేలాడ దీస్తారు. తమ ఇంట్లో క్రిస్‌మస్ ట్రీ ఏర్పాటు చేస్తారు. దీన్ని రంగు రంగుల కాగితాలు, నక్షత్రాలు, చిరుగంటలు, చిన్న చిన్న గాజు గోళాలతోను అలంకరిస్తారు.

పల్లెటూళ్లలో పండుగ నెల రోజుల్లో ఉందనగా ఇంటిని ముస్తాబు చేసుకోవడం మొదలు పెడతారు. అరిసెలు మొదలగు పిండివంటలకు సన్నాహాలు చేస్తారు. మరోవైపు యువత, 'క్రీస్తు జయంతి' నాటికను ప్రాక్టీస్ చేయడం, వెదురు కర్రలతో 'స్టార్' తయారు చేయడం లాంటి పనుల్లో మునిగిపోతారు. క్రిస్‌మస్ తాత వేషధారణతో బహుమతులు, గ్రీటింగ్‌కార్డులు ఇచ్చుకుంటూ ఆనందం వ్యక్తపరుచుకుంటారు. గతంలో కొందరు తమ పేర్లు, ఫొటోను కూడా ముద్రించి మరీ గ్రీటింగ్ కార్డులు 'ప్రింట్' చేయించి బంధుమిత్రులకు పంపేవారు. క్రమంగా 'క్రిస్మస్' గ్రీటింగ్స్ ప్రాధాన్యం 'న్యూ ఇయర్'కు బదిలీ అయింది. దాంతో సమాజంలోని అందరూ 'న్యూ ఇయర్' గ్రీటింగ్స్ పంపుకోవడం సర్వసాధారణమైంది. మానవ సంబంధాలను బలోపేతం చేసే ఎవరి పండగ అయినా– అందరికీ పండగే, సందడే! విష్ యూ హ్యాపీ క్రిస్మస్..

- షఫేలా ఫ్రాంకిన్ సెన్స్

నేను గీసిన బొమ్మ





- జె. యోగ అభినవ్ సాయి, 1వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్, అద్దంకి, బొడ్డువానిపాలెం, బాపట్ల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆటలే ప్రాణంగా ...

'వికలాంగులు కొన్ని ఆటలు మాత్రమే ఆడగలరు. క్రికెట్, కబడ్డీ వంటివి ఆడలేరు' అన్న అభిప్రాయం కొందరిలో ఉంటుంది. కానీ, సుబ్బయ్య తిరుమలై కుమార్‌ను చూస్తూ ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాలి! పోలియోకు గురై కుర్చీకే పరిమితమైన తను కబడ్డీ క్రీడాకారులను చూసి స్ఫూర్తి పొందారు. 'నేను ఎందుకు ఆడలేను?' అని ప్రశ్నించుకున్నారు. తనకు ఎందుకు ఆటలు నేర్పించరని, చేర్చుకోరని టీచర్లనే ప్రశ్నించారు. ఇష్టంతో, పట్టుదలతో చేసిన సాధన ఆయన్ని అంతర్జాతీయ క్రీడాకారుని స్థాయికి చేర్చింది. రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి బహుమతులు పొందారు. ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదగా 'శ్రేష్ఠ దివ్యాంగజన్' అవార్డును అందుకున్నారు. తిరుమలై గురించి తన మాటల్లోనే విందాం.

'**మా**ది తమిళనాడులో విరుత్‌నగర్ జిల్లా, తవాయిపురం. చిన్న మారుమూల గ్రామం. మా నాన్న సుబ్బయ్య రైతు. కష్టజీవి. ఎప్పుడూ పొలం పనులతో నిత్యం శ్రమిస్తారు. అమ్మ గృహిణి. ఇద్దరు అక్కలు, అన్నయ్య ఉన్నారు. అందరి కన్నా చిన్నవాడినని నన్ను అందరూ బాగా చూసుకునేవారు. నేను తొమ్మిది నెలల వయసులో కుడికాలికి పోలియో వచ్చింది. దాంతో నాకు నడక ఆలస్యం అయ్యింది. దోగాడటం, పాకడం కష్టంగా ఉండేది. దాంతో అమ్మ నన్ను అంటిపెట్టుకుని ఉండేది.

ఆటలు ఆడలేవన్నారు

ఊరిలో నేనొక్కడినే వికలాంగుడిని. దాంతో స్కూల్లో పిల్లలంతా నన్ను వింతగా చూసేవారు. జనం నన్ను చూసి జాలిపడుతూ 'ఎలా బతకుతాడో? ఏ పని చేయలేడు' అంటూ జాలి మాటలు మాట్లాడేవారు. చదువుకోవాలన్న ఆసక్తితో కుంటుకుంటూనే స్కూలుకు వెళ్లేవాడిని. బాల్యం అర్థమవుతున్న దశలో తోటి పిల్లలు 'ఆటలు ఆడేందుకు పనికి రావు' అని దూరంగా పొమ్మనేవారు. మానసికంగా బాధపడ్డా. క్రికెట్, వాలీబాల్ ఆడుతున్న తోటి పిల్లల కాళ్ల వైపు చూస్తూ ఉండేవాడిని. నేనూ ఆడతానని బతిమిలాడేవాడిని. కాని హేళనగా మాట్లాడేవారు. ఆ మాటలకు ఇంటికి వచ్చి ఏడ్చిన సందర్భాలు ఎన్నో. అమ్మ ధైర్యంగా ఉండమని మంచి మాటలు చెప్పేది. దాంతో క్లాసులో కూర్చుని హోంవర్క్ చేసుకుంటూ, రాని పాఠాలు చదువుకునే వాడిని.

హెడ్‌మాస్టర్‌నే ప్రశ్నించి ...

తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు పక్క ఊరిలో మండల స్థాయి కబడ్డీ పోటీలు మూడు రోజులు నిర్వహించారు. పిల్లలంతా వెళుతుంటే వారితో పాటు వెళ్లా. స్నేహితులతో కలిసి అక్కడే తిని, పడుకున్నాం. ఆ క్రీడాకారులను చూసి నాకూ ఆడాలనిపించింది. పీఈటి మాస్టారితో గొడవ పడ్డాను. ఆటల్లో ప్రవేశం కల్పించమని కోరా. కాని ఆయన మాత్రం ఒప్పుకోలేదు. దాంతో స్కూలు హెడ్‌మాస్టర్ దగ్గరకు వెళ్లి ప్రశ్నించా. 'నన్ను ఎందుకు ఆటలు ఆడనివ్వరు... ఒకసారి క్రీడల్లో అవకాశం కల్పించమని' కోరా. ఆయన బాధ్యతతో ఆటల్లో కబడ్డీ, ఫుడ్‌బాల్, ఖోఖోలో శిక్షణ ఇచ్చారు. మొదట్లో ఇబ్బంది పడ్డా. ఇష్టంతో ఆడటం వల్ల కష్టంగా అనిపించలేదు. మామూలు పిల్లలతో కలిసి పోటీ పడటం చూసి పీఈటీ మాస్టారు ఆశ్చర్యపోయారు. వెన్నుతట్టారు. దాంతో క్రీడల్లో మంచిస్థాయికి ఎదగాలని దృఢంగా నిశ్చయించుకున్నా. వెనక్కి తిరిగి చూడలేదు. పదో తరగతిలో సెలవు రోజుల్లో, ఖాళీ సమయంలో గ్రౌండ్‌కు వెళ్లి గంటల తరబడి క్రికెట్, కబడ్డీ ఆడేవాడిని. అవతల టీం సభ్యులు నన్ను చూసి... 'కాలు సరిగ్గా లేదు. వీడిని త్వరగా ఔట్ చేయొచ్చు' అనుకునేవారు. ఎక్కించేవారు. అవేమి పట్టించుకుండా బరిలో దిగేవాడిని. వికలాంగులకు విడిగా ఆటలు శిక్షణ, పోటీలు ఉంటాయని తెలియదు. మొదటిసారి పండగ సందర్భంగా పక్క ఊరి టీంతో పోటీగా నిలబడ్డాం. అందరిలా గట్టి పోటీ ఇచ్చి రూ.100 నగదు మొదటి బహుమతిగా పొందాం. ఆ సంతోషం ఎప్పటికీ మర్చిలేను.

అమ్మ మృతి కుంగదీసింది

ఇంటర్‌లోనూ కాలేజీ అయిన వెంటనే గ్రౌండ్‌కు వెళ్లి ఆటలు ఆడేవాడని. దాంతో అన్నయ్య అరిచేవారు. కాని నాన్న, అమ్మ మాత్రం నాకు నచ్చింది చేయమని ప్రోత్సహించేవారు. దాంతో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలు పట్టా. అప్పుడే అమ్మకు కిడ్నీ వ్యాధి సమస్య వచ్చింది. ఆమెను చూసి దిగులు పట్టుకుంది. చదువు మీద ధ్యాస తగ్గింది. ఆటలకు వెళ్లడం మానేశా. ఆమెను డయాలసిస్ కోసం రోజూ ఆసుపత్రికి తీసుకెళ్లి వచ్చేవాడిని. నెలల్లోనే ఆరోగ్యం క్షీణించి చనిపోయింది. ఆమెను మరిచిపోలేక రోజులు తరబడి ఏడిచా. టోర్నమెంట్స్‌కు వెళ్లలేదు. ఇంటర్ ఫైనల్ ఎగ్జామ్స్‌లో ఒక సబ్జెక్టు తప్పా. నా మానసిక పరిస్థితి చూసి నాన్న, తెలిసిన వాళ్లు ధైర్యం చెప్పారు. 'నీకు ఆటల్లో మంచి భవిష్యత్తు ఉంటది. క్రీడలు వదిలిపెట్టకు' అన్నారు. తప్పిన సబ్జెక్టు చదివి పాసయ్యా.



చదువుతూనే పారాఅథ్లెటిక్స్ పోటీల్లో

లాయర్ అంటే ఇష్టం. చిన్నప్పుడు వివాదాలు జరిగేటప్పుడు పెద్దమనిషిగా మాట్లాడి, తీర్పు ఇవ్వాలనిపించేది. అందుకే ఇంటర్ తర్వాత బిఎల్ చదివా. బెంగుళూరు యూనివర్శిటీలో లా కాలేజ్‌లో సీటు సంపాదించి ఐదేళ్ల ఎల్ఎల్‌బి చదివా. దానికీ కష్టపడ్డా. చదువుకుంటూనే నిమిషం వృథా చేయకుండా ఆటలు ఆడేందుకు వెళ్లేవాడిని. అవే నన్ను మానసికంగా కుంగిపోకుండా నిలబెట్టాయి. స్విమ్మింగ్, అథ్లెటిక్స్ క్రీడల్లో శిక్షణ తీసుకున్నా. పోటీల్లో పాల్గొని కాలేజీ స్థాయిలో జాతీయ స్థాయిలో పాల్గొని ఆరు జాతీయ, సిల్వర్ పతకాలు వచ్చాయి. ఆసియా పారా గేమ్స్ అనే ఫెస్పిక్ గేమ్‌లకు ఎంపికయ్యా. థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించా. ముఖ్యమంత్రి జయలలిత చేతుల మీదగా ప్రశంసా పత్రాలూ అందుకున్నా.



రైల్వేలో ఉద్యోగం చేస్తూ ...

క్రీడారంగంలో నా ప్రతిభకు గుర్తింపుగా 22 ఏళ్ల క్రితం రైల్వే కోటాలో విజయవాడ డివిజన్‌లో రైల్వే అడ్మినిస్ట్రేషన్‌గా ఉద్యోగం వచ్చింది. దాంతో విజయవాడలో గాంధీనగర్‌లో కుటుంబంతో స్థిరపడ్డా. ఉద్యోగం చేస్తూ రైల్వేజోన్‌లో నిర్వహించే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటివరకు 22 అంతర్జాతీయ స్థాయిలో, జాతీయ పారాగేమ్స్‌లో పాల్గొని 28 పసిడి, ఏడు రజిత, నాలుగు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నా. అప్పట్లో ముఖ్యమంత్రి రాజశేఖర్, చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసలు, అభినందనలు అందుకున్నా. ఆటలంటే ప్రాణం. అందుకే ఒక్క నిమిషం వృథా చేయను.' అంటున్న సుబ్బయ్య తిరుమలై ఉదయాన్నే లేచి గ్రౌండ్‌కు వెళ్లి స్విమింగ్ చేయనిదే నిద్రపోరు. సుమారు ఐదు గంటలు విరామం లేకుండా స్విమ్ చేస్తారు. మానసికంగా, ఆరోగ్యంగా దృఢంగా ఉండటానికి అదే ఆయన జీవిత రహస్యం.

- పద్మావతి

రంగవల్లి





ఎం.విజయలక్ష్మి, ఉక్కునగరం, విశాఖ.
19 చుక్కలు
1 వచ్చేవరకు (సరి చుక్క)

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

కాలిఫోర్నియా వర్సిటీ వర్కర్ల విజయం

- వేతన పెంపుతో 40 రోజుల సమ్మె విరమణ



లాస్ ఏంజెల్స్ : వేతన పెంపునకు కాలిఫోర్నియా యూనివర్శిటీ యాజమాన్యం అంగీకరించడంతో గత 40 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రాడ్యుయేట్ విద్యార్థులు సమ్మె విరమించారు. యూనివర్శిటీలో తరగతులను బహిష్కరిస్తూ సుదీర్ఘకాలం చేసిన ఈ సమ్మెను విరమించినట్లు యూనియన్ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. మెజారిటీ సంఖ్యలో సమ్మె చేస్తున్న గ్రాడ్యుయేట్ విద్యార్థులు, బోధనా సిబ్బంది రెండు కాంట్రాక్టులకు ఆమోదం తెలిపారు. కుదిరిన ఒప్పందాల ప్రకారం, అత్యంత తక్కువగా చెల్లించే వర్కర్లకు వేతనాలు 80శాతం వరకు పెరుగుతాయి. మొత్తంగా వర్కర్లందరికీ వేతన పెంపు అమలవుతుందని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. సుమారు 36 వేల మంది కార్మికులు ఈ ఒప్పందాల వల్ల లబ్ధిపొందుతారని, వారిలో ఎక్కువమంది ఏడాదికి కనీసం 24 వేల డాలర్లు పొందుతారని చెప్పారు. పిల్లల సంరక్షణా ఖర్చులు, ఆరోగ్య ఖర్చులకు సంబంధించిన ప్రయోజనాలు వర్కర్లకు అందేలా ఒప్పందం కుదిరినట్లు వారు చెప్పారు. అంతర్జాతీయ విద్యార్థులకు బాగా ఉపయోగపడతాయని అన్నారు. యునైటెడ్ ఆటో వర్కర్స్ ఈ చర్చలకు ప్రాతినిధ్యం వహించారు. వేలాదిమంది విద్యార్థులు సమైక్యంగా వుండి సమ్మె చేసినందువల్లే వేతనాలు, పని పరిస్థితులు మెరుగయ్యాయని యుఎడబ్ల్యు అధ్యక్షుడు రాఫెల్ జేమీ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఒప్పందాలు తక్షణమే అమల్లోకి వచ్చి 2025 మే 31వరకు అమలవుతాయి. కాలిఫోర్నియా యూనివర్శిటీ కూడా ఈ ఒప్పందాలను ప్రశంసించింది.

విదేశాల నుంచి వచ్చేవారికి ఆర్‌టిపిసిఆర్ తప్పనిసరి : కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : చైనా, జపాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్, థాయిలాండ్‌ల నుంచి వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులకు ఆర్‌టి–పిసిఆర్ పరీక్ష తప్పనిసరని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ శనివారం తెలిపారు. ఈ దేశాల నుండి వచ్చిన ఏ ప్రయాణికులకైనా లక్షణాలు వున్నట్లు కనిపించినా లేదా పాజిటివ్ వచ్చినా వారు క్వారంటైన్ అవ్వాలని మాండవీయ తెలిపారు. తమ ఆరోగ్య పరిస్థితులను తెలియజేసే 'ఎయిర్ సువిధ' ఫారమ్‌ను కూడా పూర్తి చేయాల్సి వుందన్నారు. కొత్త వేరియంట్ దేశంలోకి ప్రవేశించే ముప్పును తగ్గించేందుకు శనివారం నుంచి ప్రతి అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత్ చేరుకున్న 2శాతం ప్రయాణికులకు కోవిడ్ పరీక్షలు చేసేలా చూడాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఆసుపత్రుల్లో ఆక్సిజన్, లైఫ్ సపోర్ట్ పరికరాలు తప్పనిసరి: రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

ఆస్పత్రుల్లో ఆక్సిజన్, లైఫ్ సపోర్ట్ పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో వుండేలా చూడాల్సిందిగా రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. వైద్య పరంగా మౌలిక సదుపాయాలు, వసతులు, ఆక్సిజన్ ప్లాంట్లు అన్నీ అందుబాటులో వుండేలా చూడడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మనోహర్ అగానీ కోరారు.

భారతీయులకు అధిక ఇమ్యూనిటీ వుంటుంది : డాక్టర్ గులేరియా

చైనాలో మాదిరిగా భారత్‌లో కోవిడ్ కేసులు తాజాగా తలెత్తబోవని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా తెలిపారు. దేశంలో వాక్సినేషన్ బాగా జరగడంతోపాటు సహజసిద్ధమైన సంక్రమణ ద్వారా దేశంలో ప్రజలకు హైబ్రీడ్ రోగనిరోధక వ్యవస్థ అమలైందని చెప్పారు. ఒమిక్రాన్ ఉప వేరియంట్ బిఎఫ్–7 ఇప్పటికే దేశంలో వున్నందువల్ల కొత్తగా కేసులు పెరిగే అవకాశం, ఆస్పత్రుల్లో చేరాల్సిన పరిస్థితులు రావని తెలిపారు.



మా బావ మనోభావాలు పాట వచ్చేసింది..

బాలకృష్ణ నటిస్తున్న 'వీర సింహా రెడ్డి' చిత్రం నుంచి మూడో పాట విడుదలైంది. గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో 'మా బావ మనోభావాలు' అంటూ బయటకి వచ్చిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించారు. తమన్ సంగీతంలో సాహితి, యామిని, రేణు కుమార్ గాత్రదానం చేశారు. జనవరి 12న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.



ఆఫ్ఘన్ మహిళలపై జల ఫిరంగులు!

- 'విద్య మా హక్కు' నినాదంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు

కాబూల్ : మహిళలకు యూనివర్శిటీ విద్యపై తాలిబన్లు నిషేధం విధించడాన్ని నిరసిస్తూ ఆందోళన జరుపుతున్న ఆఫ్ఘన్ మహిళలపై తాలిబన్ భద్రతా బలగాలు శనివారం జల ఫిరంగులను ప్రయోగించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తాలిబన్ల నిర్ణయంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతూనే వున్నాయి. ప్రధాన నగరాల్లో మహిళలు ప్రదర్శనలు చేస్తున్నారు. పశ్చిమ ప్రాంత నగరమైన హెరాత్‌లో శనివారం వందల సంఖ్యలో మహిళలు ప్రావిన్షియల్ గవర్నర్‌ను గృహ నిర్బంధం చేసేందుకు వెళుతుండగా, భద్రతా బలగాలు జల ఫిరంగులను ప్రయోగించి వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 'విద్య మా హక్కు' అంటూ నినాదాలు చేస్తున్న వారిపై ఒక్కసారిగా విరుచుపడడంతో భయంతో పరుగులు తీసిన మహిళలు దాక్కోవడం వీడియోల్లో కనిపించింది. కాసేపు తర్వాత మళ్లీ వారు తమ నిరసన ప్రారంభించారు. ప్రతి వీధిలో, ప్రతి మూలల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సాయుధ వాహనాలు సైనికులతో తిరుగుతున్నాయని ఆందోళనకారులు తెలిపారు.

కేరళ ఎంజి వర్సిటీ డిగ్రీ, పీజీ విద్యార్థినులకు 60 రోజుల మెటర్నిటీ లీవ్

కొట్టాయం : 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న డిగ్రీ, పీజీ విద్యార్థినులకు 60 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కేరళలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీ సిండికేట్ సమావేశం నిర్ణయించింది. విద్యార్థినులకు చదువుపై ప్రభావం పడకుండా ప్రసూతి సెలవులు మంజూరు చేస్తూ యూనివర్సిటీ నిర్ణయం తీసుకోవడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఈ మేరకు ఎంజి యూనివర్శిటీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. యూనివర్సిటీలోని వివిధ విభాగాలు, అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ఇంటిగ్రేటెడ్, ప్రొఫెషనల్ కోర్సులు (నాన్–టెక్నికల్) చదువుతున్న 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు తొలి లేదా రెండో గర్భం దాల్చిన సమయంలో 60 రోజుల ప్రసూతి సెలవు మంజూరు చేస్తారు. అబార్షన్, గర్భస్రావం, ట్యూబెక్టమీ మొదలైన సందర్భాల్లో 14 రోజుల సెలవు అనుమతిస్తారు.

రష్యాలో వృద్ధాశ్రమంలో అగ్ని ప్రమాదం !

- 22మంది మృతి

మాస్కో : సైబీరియా నగరమైన కెమెరొవోలో ఒక ఇంట్లో శనివారం తెల్లవారు జామున మంటలు చెలరేగడంతో 22మంది మరణించారు. స్థానిక పాస్టర్‌కి చెందిన ఈ ఇల్లును నిరాశ్రయులైన వృద్ధుల కోసం ఆశ్రయంగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా ఇందుకోసం సరైన రీతిలో చర్యలు తీసుకోలేదని అర్థమవుతోంది. పెద్ద ఎత్తున చెలరేగిన మంటలను అదుపు చేయడానికి డజన్ల సంఖ్యలో అగ్నిమాపక యంత్రాలు, అత్యవసర బృందాలు కృషి చేశాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 3.30గంటలకు మంటలు చెలరేగాయి. వెంటనే 28 వాహనాలు, 80 అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలికి చేరుకున్నాయి. తొలుత 11మందే మరణించారని భావించారు. ఆ తర్వాత ఆ సంఖ్య 22కి పెరిగిందని రష్యా దర్యాప్తు కమిటీ తెలిపింది.

ఫిజీ ప్రధానిగా రబుకా

సువా (ఫిజీ) : మాజీ మిలటరీ కమాండర్ సిటివెని రబుకా శనివారం ఫిజీ ప్రధానిగా నియమితులయ్యారు. తాను అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం అనేక అల్లర్లకు, కుట్రలకు పాల్పడిందని రబుకా విమర్శించారు. 2006లో కుట్ర ద్వారా ప్రభుత్వాన్ని కూల్చి ఆ తర్వాత ఏడాదికి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఫ్రాంక్ బైనిమరామా స్థానంలో రబుకా బాధ్యతలు చేపట్టనున్నారు. పార్లమెంట్‌లో రహస్యంగా జరిగిన ఓటింగ్‌లో రబుకాకు 28ఓట్లు రాగా, బైనిమరామాకు 27ఓట్లు లభించాయి.

దోబూచులాడుతున్న విజయం

టీమిండియా లక్ష్యం–145, ప్రస్తుతం–45/4 • మెహిదీ హసన్‌కు మూడు వికెట్లు

ఢాకా: భారత్–బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో, చివరి టెస్ట్ గెలుపు ఇరుజట్లను ఊరిస్తోంది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 145పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా మూడోరోజు ఆట నిలిచే సమయానికి 40పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. నాల్గోరోజు టీమిండియా గెలుపుకు మరో 100పరుగులు చేయాల్సి ఉండగా.. బంగ్లాదేశ్ జట్టు మరో 6వికెట్లను కూలిస్తే విజయం వరించనుంది. ఓవర్‌నైట్ స్కోర్ 7 పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ జట్టు 231పరుగులకు ఆలౌటైంది. జాకిర్(51), లింటన్ దాస్(73) అర్ధసెంచరీలకు తోడు నూరుల్ హసన్(31), తస్కిన్ అహ్మద్(31)మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 87పరుగులు వెనుకబడ్డ నేపథ్యంలో టీమిండియా ముందు 145పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగల్గింది. స్వల్ప లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు మెహిదీ హసన్ దెబ్బతీసాడు. టాపార్డర్ బ్యాటర్స్ శుభ్‌మన్, పుజారా, కోహ్లీలను మెహిదీ హసన్ ఔట్ చేయగా.. కేఎల్ రాహుల్‌ను షకీబ్ పెవీలియన్‌కు పంపాడు. మూడో రోజు ఆట నిలిచే సమయానికి అక్షర్ పటేల్(26), ఉనాద్కట్(4) క్రీజ్‌లో ఉన్నారు. ఈ టెస్టులో భారత్ విజయం సాధించాలంటే మరో 100 పరుగులు కావల్సి ఉండగా.. బంగ్లాదేశ్‌కు ఆరు వికెట్లు దక్కితే చాలు.



స్కోర్‌బోర్డు..

టీమిండియా రెండో ఇన్నింగ్స్: శుభ్‌మన్ గిల్ (స్టంప్) నూరుల్ హసన్ (బి)మెహిదీ హసన్ 7, కేఎల్ రాహుల్ (సి)నూరుల్ (బి)షకీబ్ 2, పుజారా (స్టంప్)నూరుల్ (బి)మెహిదీ 6, అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 26, విరాట్ కోహ్లి (సి)మోమినుల్ (బి)మెహిదీ హసన్ 1, ఉనాద్కట్ (బ్యాటింగ్) 3, (23ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 45పరుగులు.

వికెట్ల పతనం: 1/3, 2/12, 3/29, 4/37

బౌలింగ్: షకీబ్ 6–0–21–1, తైజుల్ 8–4–8–0, మెహిదీ హసన్ 8–3–12–3, తస్కిన్ అహ్మద్ 1–0–4–0

కోహ్లి సీరియస్..



కోహ్లీకి ఔటైన సందర్భంగా బంగ్లాదేశ్ ఫీల్డర్లు రెచ్చగొట్టే ధోరణిలో సంబరాలు చేసుకోవడం ప్రస్తుతం నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఫీల్డింగ్‌లో మూడు క్యాచ్‌లు జారవిడిచిన కోహ్లీ.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 22 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేసి మెహిదీ హసన్ బౌలింగులో ఔటయ్యాడు. మెహిదీ వేసిన బంతిని డిఫెన్స్ ఆడగా ఆ బంతి షార్ట్ లెగ్‌లో మోమినుల్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో బంగ్లాదేశ్ యువ ఆటగాళ్ల ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఎగిరి గంతులేస్తూ కోహ్లిని రెచ్చగొట్టారు. దీంతో మైదానానికి వీడుతున్న కోహ్లీ కోపంగా వారి వద్దకు వెళ్లే ప్రయత్నం చేయగా.. అది గమనించిన అంపైర్లు వెంటనే అప్రమత్తమయ్యారు. బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబల్ కూడా వెంటనే ఆటగాళ్ల వద్దకు వచ్చి పరిస్థితిని అదుపు చేశాడు. అంపైర్లు సర్ది చెప్పడంతో కోహ్లీ మైదానాన్ని వీడాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68